
వార్త
ఆదివారం
8 జనవరి, 2023
ఊపిరిలోకి
విషపు చుక్కలు



# టీచరు పాత్రలో శ్రుతిహాసన్

నందమూరి బాలకృష్ణ కథానాయకుడుగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రాబోతున్న సినిమా 'వీర సింహారెడ్డి'. ఈ సినిమాలో శ్రుతిహాసన్ స్కూల్ టీచర్‌గా కనిపించనుందని, ఆమె పాత్ర చాలా కీలకమైందని సమాచారం. అదే విధంగా శ్రుతిహాసన్ పాత్ర కామిక్ యాంగిల్‌లో ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి థమన్ సంగీతం సమకూరుస్తున్నారు. 'డాన్ శీను', 'బలుపు', 'పండగ చేస్కో' లాంటి సినిమాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకుని 'క్రాక్' సినిమాతో భారీ కమర్షియల్‌గా హిట్ కొట్టి యాక్షన్ డైరెక్టర్‌గా గోపీచంద్ మలినేని స్టార్ డమ్ సాధించాడు. ప్రస్తుతం బాలయ్యతో సినిమా చేస్తున్న 'వీర సింహారెడ్డి' ఇక గోపీచంద్ ఏ రేంజ్‌లో హిట్ సాధిస్తాడో చూడాలి. ఈ సినిమాపై అందరికీ మంచి అంచనాలు ఉన్నాయి.

## తారాతీరం



# రామ్ సినిమాలో సునీల్‌శెట్టి?

యాక్షన్ డైరెక్టర్ బోయపాటి శ్రీను, రామ్ కలయిలో ఓ సినిమా రాబోతుంది. ఇందులో ఒక కీలక పాత్రలో సునీల్‌శెట్టి నటించనున్నట్లు తెలుస్తోంది. సీనియర్ హీరో సునీల్‌శెట్టి ఈ చిత్రంలో ముఖ్య పాత్రలో కనిపించబోతున్నాడు. సునీల్‌శెట్టి కారణంగా కచ్చితంగా రామ్ సినిమాకి బాలీవుడ్‌లో ప్లస్ అవుందని టాక్. బాలీవుడ్ భామ ఊర్వశి రౌటేలా ఓ ఐటెం సాంగ్ చేస్తోంది. ఈ చిత్రంలో రామ్ ద్విపాత్రాభినయం చేయనున్నట్లు టాక్. 'అఖండ' సినిమాతో అదిరిపోయే సూపర్‌హిట్ సినిమాని తన ఖాతాలో వేసుకున్నాడు బోయపాటి. కనుక బోయపాటి చేస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అందుకే రామ్ సైతం ఈ చిత్రంపై భారీ హోప్స్ పెట్టుకున్నాడు.

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
8 జనవరి, 2023

## మంచి ముత్యాలు

నిరంతరం ఎదుటివారి మెప్పు కోసం
తాపత్రయపడేవాడు తన సహజగుణాలు,
మనశ్శాంతి కోల్పోతాడు.
- గాండేకర్

## విషయ విశేషం

బంగారు భవంతి... 4
'సంఘీ'భావం....5
అన్యమత దూషణలను అరికట్టాలి
వాయసం కనిపించని క్షేత్రం .....6
కవర్ స్టోరీ..8
ఊపిరిలోకి
విషపుచుక్కలు
బాబోయ్! వీటిని కొనలేం.... 14
విశాలభావాలే ప్రగతికి మూలం....18
కథ.. 20
'పాత' రేసిన పండగ
సాహిత్యం.. 23
తెలుగు పత్రికా రంగానికి ..
జీవితమే ఒక ఆట ..26
ఈవారం కవిత్వం..27
పల్లెకి పోదాం..
ఆదాయం.. 30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
సరదాగా కాసేపు..
వగైరా..వగైరా..




# తాజా వార్తలు

## విభిన్న రీతుల్లో అచ్చులు

చిన్న పిల్లలు తినే విషయంలో చాలాసార్లు మారాం చేస్తుంటారు. వాళ్ల 'నో' చెప్పకుండా ఉండేందుకు మనం రకరకాల పద్ధతులు పాటిస్తుంటాం. అందులో భాగంగా ఇప్పుడు విభిన్న రీతుల్లో వుండే కజ్జికాయలు/సమోస/కచోరి/మోదక్ అచ్చులు లభిస్తున్నాయి. చతురస్రం, హృదయాకారంతో పాటు మరెన్నో ఆకారాల్లో అచ్చులు లభిస్తున్నాయిప్పుడు. వీటిని 'కిచెన్ డంప్లింగ్ మోల్డ్స్' అంటారు. వివిధ రంగుల్లో, ప్లాస్టిక్, స్టీలుతో తయారైన ఈ అచ్చులు మార్కెట్లో లభిస్తున్నాయి.


### కొత్త రకం క్యూబ్



ఈ రూబిక్స్ క్యూబ్ చూడడానికి సాధారణంగానే కనిపిస్తుంది. కానీ దీనికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే ఈ క్యూబ్ ఆట కూడా నేర్పుతుంది. ఇది స్మార్ట్ టెక్నాలజీతో పని చేసే క్యూబ్. స్మార్ట్, బ్లూటూత్ క్యూబ్ పేర్లతో మార్కెట్లోకి వచ్చింది ఈ కొత్త రకం క్యూబ్. బ్లూటూత్ పని చేసే దీనిని ఫోన్‌కో, ట్యాబ్‌కో కనెక్ట్ చేసుకుని దీని ఆప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత మన చేతిలోని క్యూబ్ ఫోన్‌లో కనిపిస్తుంది. ఆట నేర్చుకోవాలనుకున్న వాళ్లకు ఒక్కో కదలికను చూపిస్తూ రంగులు కలుపుతూ ఆట నేర్పిస్తుంది. పజిల్ పూర్తి చేయడం వచ్చినవాళ్లు దీంట్లో టైం సెట్ చేసుకుని ఎవరికి వారే పోటీ పెట్టుకుంటూ, పరిష్కరిస్తూ దాన్ని రికార్డు చేసుకోవచ్చు. మరిన్ని మెళకువలూ నేర్చుకోవచ్చు. ఎవరికైనా బహుమతిగా ఇచ్చేందుకు బాగుంది క్యూబ్.

### ఊరంతా బాడుగకి తీసుకోవచ్చు..

ఎవరైనా ఇంటిని తీసుకోవడం సర్వసాధారణం. ఆఫీసు పనులు, విహార యాత్రలు మొదలైన ఇతర పనుల నిమిత్తం పొరుగూరు వెళ్లినప్పుడు లేదా కొన్ని రోజుల కోసమే అయితే హోటల్ గది అద్దెకు తీసుకోవటం సామాన్యమైన విషయం. ఇటలీలో చిత్రమైన ఒక ఊరుంది. ఎవరైనా నిర్ణీత మొత్తం చెల్లిస్తే ఏకంగా ఆ ఊరిని అద్దెకు తీసుకోవచ్చు. ఇటలీ నడిబొడ్డున ఉండే లె మార్చె ప్రాంతంలో ఉన్న మధ్య యుగాల నాటి ఈ ఊరి పేరు పెట్రిటోలి. రోమన్ నాగరికత కాలం నాటి పురాతన కట్టడాలు, వాటిలోని నేల మాళిగలు, వాటితో పాటు భారీ రాజ ప్రాసాదం, ఒక రంగస్థల వేదిక ఈ ఊరి ప్రత్యేకతలు. అద్దె ఒక రోజుకి ఒక లక్షా ఇరవై ఎనిమిది వేల అయిదు వందల డెబ్బై ఏడు రూపాయలు చెల్లించాలి.








# బంగారు భవంతి



వియత్నాంలోని కాన్‌థో నగరంలో ఈ మధ్య వెలసిన బంగారు భవనం అంతర్జాతీయంగా వార్తలకెక్కింది. కాన్‌థో నగరానికి చెందిన ఎంగ్యుయెన్ వాన్ ట్రుంగ్ అనే ఆసామి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఇబ్బడి ముబ్బడిగా సంపాదించాడు. కొత్త తరహాలో ఇల్లు నిర్మించుకోవాలని ఇళ్ల నమూనాలు చూడటానికి దేశ దేశాల్లో సంచరించాడు. ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డెకరేటర్లతో చర్చలు జరిపాక ఇదివరకు ఎవరూ కనీవినీ ఎరుగని రీతిలో ఇల్లు నిర్మించాలని నిశ్చయించుకుని బంగారు తాపడంతో భవనాన్ని నిర్మించాడు. ఇంటి వెలుపల గోడలను, పైకప్పును పూర్తిగా బంగారు రేకులతో తాపడం చేయించాడు. ఇంటి బయటే కాదు, లోపల కూడా అడుగడుగునా కళ్లు చెదిరేలా బంగారు వస్తువులతో నింపేశాడు. ఇంట్లోని చాలా వస్తువులు పూర్తి బంగారంతో తయారు చేయించినవి అయితే, మరికొన్ని భారీ విగ్రహాల వంటి మాత్రం బంగారు తాపడంతో చేయించినవి.



ఆరేళ్ల క్రితమే బంగారు భవనాన్ని నిర్మించాలని అనుకున్నానని, దీని నిర్మాణం పూర్తి చేయడానికి మూడేళ్లు పట్టిందని ట్రుంగ్ అంటున్నాడు. ఇప్పుడు ఆ భవనం వియత్నాం దేశానికి ప్రత్యేక ఆకర్షణగా మారింది. వియత్నాం వచ్చే విదేశీ పర్యాటకులు పనిగట్టుకుని మరీ కాన్‌థో నగరానికి వచ్చి ఇంటిని సందర్శిస్తున్నారు.



'సంఘీ' భావం



# అన్యమత దూషణలను అరికట్టాలి

**గత** కొంతకాలంగా అన్యమత దూషణలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులు సైతం మత విశ్వాసాలకు భంగం కలిగే విధంగా ప్రసంగాలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో రాజకీయాల్లో ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఏ మతం పైనా అయినా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు. అన్ని మతాల్లో కొన్ని అసంబద్ధమైన ఘటనలు చోటుచేసుకుని ఉన్నాయి. వాటిని ఆయా మతస్థులు పట్టించుకోకుండా దైవాన్ని విశ్వసించి మాత్రమే ప్రార్థనలు చేసుకుంటారు. అంతేకాని లోతైన ఆలోచనాధోరణి ఉండదు. అది వారి మతవిశ్వాసానికి సంబంధించిన అంశం. ఎవరి మతాన్ని వారు గౌరవించుకోవడంలో ఏమాత్రం తప్పిదం, ఆక్షేపణలేదు. అలాగే తమ మతమే గొప్పదని భావించడం కూడా తప్పుకాదు. అంతటితో ఆగకుండా పక్క మతం మీదనో, లేక నాస్తికులు స్వంత మతంపైనో విమర్శలు చేయడం వల్ల ప్రశాంత వాతావరణం దెబ్బతింటుంది. గతంలో కూడా మతాలను విమర్శించే ప్రసంగాలు జరిగినప్పటికీ అవి ప్రచారంలోకి వచ్చేవి కావు. ముఖ్యంగా ప్రింట్ మీడియా ఈ విషయంలో ఎంతో సమన్వయంతో వ్యవహరిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లో కూడా వారు చేసే ప్రసంగాలు ప్రచురించి ప్రాచు ర్యం కలిగించే ప్రయత్నం చేయలేదు. ఒకవేళ ఇలా ప్రచురిస్తే రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే వారికి మద్దతు ఇచ్చినట్లు అవుతుంది. ప్రింట్ మీడియాలో ఎక్కడా ఇలాంటి ధోరణి కనిపించదు. చివరకు రెండు మతాల మధ్య ఘర్షణ జరిగి, ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగినా ఎక్కడా మతం పేరును ప్రస్తావించదు. ఒక వర్గం దాడులు అనో, రెండు వర్గాల మధ్య ఘర్షణ అనో పేర్కొంటుందే కాని స్పష్టత ఇచ్చి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం జరగలేదు. ఎలక్ట్రానిక్ మీడియా వచ్చిన తరువాత ఇలాంటి ప్రసంగాలు ప్రసారం చేసినా బీప్ అనే శబ్దంతో అసలు కంటెంట్‌ను ప్రచారం చేయదు. అయితే ఆ వ్యక్తి ఏమి మాట్లాడుతున్నాడు అన్న విషయం కొంత అర్థం అవుతుంది. ఇప్పుడు సోషల్ మీడియా వచ్చిన తరువాత గోప్యం అనేది పూర్తిగా పోయింది. అసభ్యపదజాలాన్ని యథాతథంగా పోస్ట్ చేస్తున్నారు. య్యూటూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దీనివల్ల అనవసర రాద్ధాంతం జరుగుతోంది. ఒకవర్గాన్ని రెచ్చగొట్టాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలన్న ఏకైక ఉద్దేశ్యంతో మత విశ్వాసాలు దెబ్బతినేవిధంగా చేసిన ప్రసంగాలను వైరల్ చేయడం ద్వారా పరోక్షంగా అటువంటి వ్యక్తికి మద్దతు ఇచ్చినట్లు అవుతుంది. ఆ వ్యక్తి సభలో మాట్లాడితే వందమంది గాని, రెండు వందల మందిగాని వింటారు. సోషల్ మీడియాలో వైరల్ చేయడం వల్ల లక్షలు, కోట్లమంది చూసే అవకాశం కలుగుతుంది. దీనితో ప్రశాంతంగా ఉండే ప్రాంతాల్లో స్పర్థలు ఏర్పడతాయి, దూరం పెరుగుతుంది. ఆ వర్గానికి చెందిన వారు అందరూ తమ మతాన్ని కించపరుస్తున్నారన్న భావన పెరుగుతూ వస్తుంది. ప్రపంచంలోనే మనదేశం సెక్యులర్ విధానాలను సమర్థవంతంగా కొనసాగిస్తున్న దేశంగా గుర్తింపు పొందింది. అనేక భాషలు, మతాలు, కులాలు ఇక్కడ కలిసిమెలసి ఉంటున్నాయి. ఇతర దేశాల్లో ఒకే మతం ఉన్నా విధ్వంసాలు జరుగుతూనే ఉంటాయి. సెక్యులర్ దేశంగా కొనసాగుతున్న తరుణంలో కొందరు కుహనా సెక్యులర్ వాదులు ఒక వర్గానికి కొమ్ము కాస్తూ అగ్నికి ఆజ్యం పోస్తుంటారు. అంబేద్కర్ కాని, ఏ రాజకీయ పార్టీ గాని మతాలకు వ్యతిరేకంగా మాట్లాడమని, కించపరచమని చెప్పిన దాఖలాలు లేవు. అయితే ఆయా వ్యవస్థలను అడ్డు పెట్టుకుని కొందరు మతకలహాలు రెచ్చగొడుతూనే ఉన్నారు. ఈ విషయంలో పోలీసులు సమర్థవంతంగా మెలగాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఎక్కడైనా మతవిద్వేషాలకు తావునిచ్చే ప్రసంగాలు కాని, కార్యక్రమాలు కాని జరిగితే పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి విమర్శలకు తావు లేకుండా వారిపై చర్యలు తీసుకోవాలి. ఒక వర్గాన్ని కాని, మతాన్ని కాని రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే వారిపై ఐపిసి సెక్షన్లు 153ఏ, 295ఏ, 298, 505, 506, 508ల కింద కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికి చాలామందిపై కేసులు పెట్టినా వారు కోర్టు నుంచి బెయిల్ పొంది మళ్లీ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. ఒక్క 505 సెక్షన్‌లో మాత్రమే ఇలాంటి ప్రసంగం వల్ల ప్రాణహానీ జరిగితే ఏడేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉంటుంది. ఏడేళ్లు పైబడి శిక్ష పడే కేసులకు మాత్రమే అప్పటికప్పుడు అరెస్ట్ చేయాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసింది. అంతకంటే తక్కువ శిక్షలు ఉంటే ముందుగా సదరు వ్యక్తికి నోటీసు ఇచ్చి అరెస్ట్ చేయాలి. ఈ నిబంధన వల్ల మతవిద్వేషాలను రెచ్చగొట్టేవారికి చట్టంపై కూడా భయం, గౌరవం లేకుండా పోతోంది. ఈసారి పోలీసులు ఒక ఎమ్మెల్యేపై పిడీ చట్టాన్ని ప్రయోగించారు. ఈ చట్టం కింద అరెస్ట్ అయిన వ్యక్తికి మూడు నెలల వరకు బెయిల్ లభించదు. మూడు నెలల తరువాత పిడి చట్టం అమలు కమిటీ సమావేశమై చర్చించి నిర్ణయం తీసుకుంటుంది. ఈ విషయంలో పోలీసులకు పాలకులు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలి. ప్రస్తుతం పెడుతున్న కేసులు కాకుండా రాజద్రోహం కిందకు వచ్చే సెక్షన్లు నమోదు చేయాలని కొందరు వాదిస్తున్నారు. మతాలను గాని, వర్గాలను కాని కించపరి చే విధంగా ప్రసంగాలు చేసేందుకు ఏ ఒక్కరూ సాహసించని విధంగా పోలీసులు ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఉంది. ఎవరైనా ఇలాంటి ప్రసంగాలు చేసే ప్రయత్నం చేస్తే వేదికపై ఉన్న వారు కాని, సభికులు కాని అభ్యంతరం చెబితే ఆయా వ్యక్తులు కూడా తమ వైఖరిని మార్చుకుని సమాజానికి పనికి వచ్చే అంశాలపై దృష్టి సారించే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# పాయసం కనిపించని క్షేత్రం



శుభకరమైన 'శివ' శబ్దం సకల చరాచర సృష్టి లోని సమస్త జీవకోటికి ఆధారం. రూపరహితుడైన నాగాభరణ ధరుణికి భూలోకంలో ఎన్నో ఆలయాలున్నాయి. పురాణ గాథల ఆధారంగా ఈ పవిత్ర క్షేత్రాల్లో చాలా చోట్ల సర్వేశ్వరుడు స్వయం భూలింగంగా ఉద్భవించినవే. ఒక్కో క్షేత్రానికి ఒక్కో ప్రత్యేకత. మిగిలిన వాటికి పూర్తిగా విభిన్నమైనదిగా పేర్కొనదగిన మహోన్నత క్షేత్రం కోటప్ప కొండ ఆంధ్రప్రదేశ్‌లో ఉంది.

దేశ నాయకులు, దేవీ-దేవతల ఫొటోలు పెట్టిన పెద్ద పెద్ద ప్రభలు కట్టుకొని ఎడ్లబండ్లు/ ట్రాక్టర్ల మీదో అలంకరించి మేళ తాళాలతో, నృత్య గానాలతో, భక్తి భావంతో తమ గ్రామాల నుండి తండోపతండాలుగా తరలి వస్తారు 'కోటప్ప కొండకు'. ఈ క్షేత్రం శివరాత్రికి మహాద్భుత ఉత్సవ వాతావరణం సంతరించుకుంటుంది. భక్తులకు అభీష్ట సిద్ధిని ప్రసాదించే అతి ప్రాచీన ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటప్పకొండతో ముడిపడి వున్న పురాణ గాథ కృతయుగం నాటిదిగా తెలుస్తోంది.

దక్ష యజ్ఞం కథ అందరికీ తెలిసిందే. దక్ష ప్రజాపతి అల్లుడైన పరమేశ్వరుణ్ణి పిలవకుండా తలపెట్టిన యజ్ఞానికి సతీదేవి వచ్చి అవమానింపబడి, తట్టుకోలేక యజ్ఞ గుండంలో దూకిందట. విషయం తెలిసిన రుద్రుడు మహోగ్రత రూపంలో వీరభద్రుని సృష్టించి గణాలతో పాటు పంపి దక్ష యజ్ఞాన్ని భంగం చేసారు. గంగాధరుని ఆగ్రహం తట్టుకోలేక దేవతలు, మునులు స్తోత్రం చేసి శాంతింపచేసారు.

శాంతించిన సదాశివుడు బాలవటువు రూపంలో దక్షిణామూర్తిగా త్రికూటాచలంగా పిలవబడే ఇక్కడి రుద్ర శిఖరం మీద బ్రహ్మాది దేవతలకు, మునులకు, సిద్ధులకు, జ్ఞాన బోధ చేసారట. సహజంగా జ్ఞాన ప్రదాత అయిన దక్షిణామూర్తి శివాలయాలలో విమానం మీద, గర్భాలయం వెలుపల దక్షిణాముఖుడై కొలువై ఉంటారు. విద్యను ప్రసాదించే గురువు దక్షిణామూర్తి, జ్ఞాన దక్షిణామూర్తి, మేధో దక్షిణామూర్తి, యోగ దక్షిణామూర్తి.. ఇలా ఎన్నో పేర్లతో పిలవబడుతూ కొలవబడుతున్నారు. సర్వ విద్యలకు మూలం ఈయనే. కోటప్పకొండలో కొలువైన దక్షిణామూర్తి రూపుడైన త్రికోటేశ్వర స్వామి భక్తుల ఇహలోక అభిలాషలను నెరవేర్చి ముక్తిమార్గం వైపుకు మళ్లిస్తారన్నది నమ్మకం. ఎటు నుంచి చూసినా మూడు శిఖరాలుగా కనిపించే త్రికూటాలయం త్రిమూర్తులకు ఆవాసం.

మధ్యలో ఉన్న రుద్రశిఖరం పైన స్వామి తొలుత ప్రకటితమైంది, సర్వ దేవతలకు జ్ఞానబోధ చేసింది. అందుకే ఇక్కడి లింగాన్ని 'పాత కోటయ్య' అని పిలుస్తారు. ప్రస్తుతం అక్కడికి కొండలలో నడకదారి ఏర్పాటు చేయబడింది. ఆయన ప్రస్తుత స్థానానికి రావడానికి సంబంధించిన కథ కలియుగానిదే.

స్వామి రుద్ర పర్వతంపైన ఉండగా ఆయన సేవా భాగ్యం కోరుతూ శ్రీహరి తపస్సు చేసారట. సంతుష్టుడైన సర్వేశ్వరుడు ప్రత్యక్షం కాగా శ్రీమన్నారాయణుడు స్వామిని అక్కడే కొలువు తీరమని అర్థించారట. తన శూలంతో రాతి మీద పొడిచి ఉద్భవించిన జలంలో స్నానమాచరించినవారి పాపాలు ప్రక్షాళన అవుతాయని తెలిపారు. అందువల్ల ఆ జలధారను 'పాప నాశన తీర్థం' అనీ, అక్కడ ఉన్న లింగేశ్వరుని 'పాప నాశేశ్వర స్వామి' అని అంటారు.

ఈశాన్యంలో ఉన్న ఈ పర్వతాన్ని 'విష్ణు శిఖరం' అంటారు. కొంచెం దూరంలో పాపనాశేశ్వర ఆలయం కనిపిస్తుంది.

ప్రస్తుత ఆలయం ఉన్న పర్వతం మీద బ్రహ్మ పరమేశ్వరుని గురించి తపస్సు చేసి, ప్రత్యక్షమైన భక్తసులభుని తన పేరు మీద ఉన్న శిఖరం మీద కొలువు తీరమని కోరగా కలియుగంలో నెరవేరుతుందని తెలిపారట. కొండపైకి వెళ్లే రహదారి పక్కన పెద్ద కమలాసనుని విగ్రహం దర్శించుకోవచ్చు. కోటప్ప కొండకు వెళ్లే మార్గంలో కొండకా పూరు అనే గ్రామం ఉంది. శతాబ్దాల క్రితం అది పశుపాలకుల గ్రామం. వారి నాయకుడైన సునందుని గారాల పట్టి 'ఆనందవల్లి' చిన్నతనం నుండి శివభక్తి ఎక్కువ. నిరంతరం శివ నామస్మరణ చేస్తూ మిగిలిన పిల్లల చేత కూడా చేయించేది. ఒక శివరాత్రి రోజున రుద్ర శిఖరం మీద కొలువైన శ్రీత్రికోటేశ్వర స్వామిని సందర్శించిన తరువాత ఆమె జీవనశైలి పూర్తిగా మారిపోయింది.

ప్రతిరోజూ పాపనాశన తీర్థం నుండి జలాన్ని, ఇంటి నుండి గో క్షీరాన్ని తీసుకొని పర్వతాగ్రం చేరి భక్తిశ్రద్ధలతో శివాభిషేకం చేసి ఆ అభిషేక జలాన్ని స్వీకరించేది. నియమంగా క్షీరాన్ని శివునికి సమర్పించడంతో అందరూ ఆమెను ప్రేమతో 'గొల్లభామ' అనేవారు.

ఒకనాడు నీటిపాత్ర మీద కాకి వాలడంతో నీళ్ల నేలపాలైయ్యాయి. ఆగ్రహించిన ఆనందవల్లి ఈ క్షేత్రంలో వాయసాలకు స్థానం లేదని శపించింది.

## వాయస సంచారం కనిపించదు

ఇక్కడ శునకాలు, మార్జాలాలు, మర్కటాలు నిర్భయంగా సంచరిస్తుంటాయి. కానీ కాకులు మాత్రం కనిపించవు. భక్తవ శంకరుడు బాలిక భక్తిని పరీక్షించాలనుకుని పురుష స్పర్శ ఎరుగని ఆమె గర్భవతి అయ్యేలా చేసారు. కించిత్తు బాధ పడకుండా అలాగే కొంత పై భాగానికి వెళ్లి శివపూజ చేసేది.

ఆమె దీక్షకు సంతసించిన నందివాహనుడు యతి రూపంలో దర్శనమిచ్చి భిక్ష కోరారు.

ఆమె సంతోషంగా యతిని ఇంటికి ఆహ్వానించింది.

దానికి ఆ యతీశ్వరుడు "నువ్వు వెనుకకు చూడకుండా వెళ్ళు, నీ వెనక వస్తాను. వెనుకకు చూస్తే నేను అక్కడే ఆగిపోతాను" అని హెచ్చరించారట.

శివ నామస్మరణ చేస్తూ నిండుగర్భిణి నడవలేక నడుస్తూ కొండ దిగసాగింది.

ఆమె వెనక ప్రణవ స్వరూపుడు నడుస్తూ వస్తుంటే సమస్త భువనాలు కనిపించేలా దేవ దుందుభులు మోగసాగాయి.

దుర్బల శరీరం, పైగా గర్భం. అలసటతో ఆగి ఆసక్తితో వెనక్కి తిరిగి చూసిందట. అంతే..! యతి అదృశ్యమయ్యాడు. ఆకాశం నుండి "నీవు నా మాట తప్పినందున నేను ఇక్కడే ఆగిపోతున్నాను. ఇదే కలియుగంలో కోటేశ్వరుని నూతన నివాసం. నీవు నా పట్ల అపరిమిత భక్తి కలిగి వున్నందున నీకు ఏం కావాలో కోరుకో" అన్న స్వరం వినిపించింది. ఆమె తన తప్పిదానికి చింతిస్తూ ప్రాయోపవేశం చేయడానికి నిర్ణయించుకోగా భవబంధ నాశనుడు ప్రత్యక్షమై దీవించగా ఆమె గర్భం నుండి శిశువు జన్మించడం, వెంటనే అదృశ్యం అవడం జరిగింది. ఆమె అమితానందంతో స్తోత్రం చేసి నిరంతర శివ సాన్నిధ్య యోగం ప్రసాదించమని కోరింది.

అనుగ్రహిస్తూ కైలాసాధుడు "నీకు ఈ క్షేత్రంలో స్థిర నివాసం అనుగ్రహిస్తున్నాను. భక్తులు నిన్ను దర్శించిన తరువాతే నా దర్శనానికి రావాలి" అని చెప్పారు. సోపాన మార్గంలో పర్వతంపై భాగానికి చేరుకొనే చోట శ్రీగొల్లభామ ఆలయం ఉంటుంది. భక్తురాలిని అనుగ్రహిస్తూనే గతంలో సృష్టికర్తకు తనిచ్చిన మాట నిలబెట్టుకొన్నారు శ్రీకోటేశ్వర స్వామి.

ఎలమందకు చెందిన సాలంకయ్య శివభక్తితత్పరుడు. కోటప్ప కొండలలో కట్టెలు కొట్టి తెచ్చుకొని అమ్మి వచ్చిన దాంతో సాధు సంతుల సేవ చేసుకుంటూ సంతృప్తిగా జీవనం సాగించేవాడు.

ఒకనాడు రుద్ర శిఖరం మీద లింగాన్ని సేవించుకొని వస్తుండగా ఒక జంగమ దేవర కనిపించగా ఆయనను సాదరంగా తన గృహానికి ఆహ్వానించాడు. ఆయన కొంత కాలం సాలంకయ్య ఇంట్లో ఉండి పోయారు. పాలను మాత్రమే స్వీకరించే వారు. ఆయన అక్కడ ఉండగానే సాలంకయ్యకు అడవిలో నిధి లభించింది. అతను అంతా కోటయ్య కృప అని అనుకున్నాడు.

ఒకనాడు అతిథి జంగమయ్య ఇంట్లో లేకపోవడంతో కొండా కోనా గాలించిన సాలంకయ్య అలసిపోయి అడవిలో సొమ్మసిల్లి నిద్రలోకి వెళ్లగా స్వప్నంలో దర్శనమిచ్చి "నీ ఇంట్లో ఆతిథ్యం తీసుకున్న జంగమయ్యను నేను. మీ అందరి కోసం బ్రహ్మగిరిలో కొలువుతీరాను. అక్కడ నీవు కోవెల నిర్మించు" అని చెప్పాడట.



శివాజ్ఞ మేరకు సాలంకయ్య ఆలయాన్ని నిర్మించి తన సోదరులతో మిగిలిన కుటుంబ సభ్యులతో ఆజన్మాంత సర్వేశ్వరుని సేవలో గడిపి కైలాసం చేరుకొన్నాడు. గర్భాలయం వెనుక సాలంకయ్య లింగం, మండపం చూడవచ్చు. అలా తొలి ఆలయ నిర్మాణం జరిగింది. తరువాతి కాలంలో చోళులు, శాతవాహనులు, చాళుక్యులు, విజయ నగర రాజులు, ఎందరో జమిందారులు ఆలయాభివృద్ధికి తమ వంతు కృషి చేసినట్లుగా లభించిన శాసనాల వల్ల తెలుస్తోంది. స్వామి బాల వటువు కనుక ఇక్కడ అమ్మవారి సన్నిధి ఉండదు.

పర్వతం పైన ఎన్నో తీర్థాలు, లింగాలు ఉంటాయని ప్రతీతి. ఉపాలయాలలో శ్రీ మేధో దక్షిణామూర్తి, శ్రీ గణపతి, శ్రీ కార్తికేయ, శ్రీ గొల్లభామ, నాగపుట్ట ఉంటాయి. ధ్యాన మందిరం, అన్నదాన మండపం, ఉత్సవ మండలం నిర్మించారు. కానీ ధ్వజస్తంభం ఉండదు.

పర్వత పాదాల వద్ద శ్రీ వినాయక, శ్రీ బొచ్చు కోటయ్య, శ్రీ ప్రసన్న కోటేశ్వరుడు, శ్రీ నీలకంఠస్వామి, శ్రీ విజయ సిద్ధి గణపతి, శ్రీ శనేశ్వర, శ్రీరామ, శ్రీ శిరిడిసాయి ఆలయాలు ఉంటాయి. మెట్లు, రహదారి మార్గంలో కొండపైకి చేరుకోవచ్చు. రమణీయ ప్రకృతి కోటప్ప కొండ సొంతం. ఒకప్పుడు కనీస వసతులు కూడా లేని కోటప్పకొండ ఇప్పుడు యాత్రికులకు సంపూర్ణ ప్రశాంత యాత్రా ఫలం దక్కే విధంగా అభివృద్ధి చెందింది.

రహదారిని సుందరంగా తీర్చిదిద్దారు. పిల్లలకు మనో ల్లాసం కలిగించే విధంగా ఉద్యానవనాలు, జంతు ప్రదర్శనశాలలు, ఆట స్థలాలు నిర్మించారు. దారి లో బ్రహ్మ, శ్రీ మహావిష్ణువు, ముగ్గుర మ్మల సుందర రూపాలు, పైన గణనాథుణ్ణి నిలిపారు.

## వసతి సౌకర్యాలు

కొండపైన ఉండటానికి అతిథి గృహ లు ఉన్నాయి. దేవస్థానంవారు ఏర్పాటు చేసిన అన్నప్ర సాదం లభిస్తుంది. కొండ కింద సత్రాలు ఉన్నాయి. భక్తులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం లభిస్తుంది. ప్రతిరోజూ నియమంగా అభిషేకాలు, అలంకరణలు చేస్తారు. ఉద యం ఆరు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు; సాయంత్రం నాలుగు నుండి రాత్రి ఎనిమిది వరకు ఆలయం తెరిచి ఉంటుంది.

సోమవారాలు, పౌర్ణమి, మాస శివరాత్రి, కార్తిక మాసంలో పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీ కోటేశ్వర స్వామిని దర్శించుకుంటారు. శివరాత్రి రోజున వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుండి వస్తారు.

ఈ క్షేత్రం గుంటూరు జిల్లాలోని నరసరావు పేటకు పద్నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. నరసరావు పేటకు రాష్ట్రం నలుమూలల నుండి బస్సు/రైలు మార్గంలో సులభంగా చేరుకోవచ్చు.

**- ఇలపావులూరి వెంకటేశ్వర్లు**



# ఊపిరిలోకి విషపు చుక్కలు

కవర్ స్టోరీ

**షేక్ అబ్దుల్ వాకీం జాని**

**నేడు** ప్రపంచంలోని పలు దేశాలతో పాటు మన భారతదేశంలో కూడా కాలుష్యం విజృంభించడంతో అనేక సమస్యలు ఎదురౌతున్నాయి. ఆ కారణంగా కాలుష్యం అనేది ప్రపంచ సమస్యగా మారిపోయింది. ఇటీవల భారత రాజధాని న్యూఢిల్లీ నగరాన్ని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేసింది. న్యూఢిల్లీ నగరం గతంలోనూ పలుమార్లు వాయు కాలుష్యానికి గురైన సంగతి అందరికీ తెలిసిన విషయమే. గతంలో ప్రజలు ఆనందంగా చేసుకున్న దీపావళి సంబరాలలో మితిమీరి బాణసంచా కాల్చ డం వల్ల 23 నగరాలలో ఉత్పన్నమైన అదనపు వాయు కాలుష్యంతో గాలి నాణ్యత గణనీయంగా పడిపోయిందని సర్వేలలో తేలింది. ఢిల్లీలో దారుణ పరిస్థితి నెలకొందంటూ సాక్షాత్తు దేశ అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానిం చడం కాలుష్య తీవ్రతకు నిదర్శనం. వాయు కాలుష్యం వల్ల కమ్ముకున్న పొగమంచు కారణంగా ఢిల్లీలో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. చాలా మంది ఉద్యోగస్తులు వర్క్‌ఫ్రమ్ హోమ్ పేరుతో తమ కార్యకలాపాలు ఇంటి నుండే నిర్వహించారు. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యం కారణంగా దుమ్ము, ధూళి, పొగ కమ్ముకుని రోడ్లు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఈ స్థాయిలో గాలి కాలుష్యం కావడంతో ప్రజలు రోగాల బారిన పడే పరిస్థితి నెలకొంది. దేశ రాజధాని ఢిల్లీ రీజియన్ ఎన్సీఆర్‌లో వాయు కాలుష్యం భారీగా పెరిగిపోవ డంతో ఆయా ప్రాంతాల్లో నివసించే కుటుంబాలు ఇబ్బందులుపడాల్సి వస్తోంది. ఢిల్లీ-ఎన్సీఆర్ సెక్టార్‌లో నివసిస్తున్న 80 శాతం కుటుంబాల్లో గత కొన్ని వారాల్లో కనీసం ఒక్కరైనా వాయు కాలుష్య సంబంధిత వ్యాధులను ఎదుర్కొన్నారని కమ్యూనిటీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. గాలి పీల్చుకోవడానికి కొందరు ఇబ్బందులు పడుతుండగా, మరికొందరు పలు వ్యాధులతో సతమతమవుతున్నారు. డాక్టర్లను కలిసేవారి సంఖ్య గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. 8,097 మంది ప్రజలను సర్వే చేయగా కొందరు తాము గొంతు నొప్పి లేదా దగ్గుతో ఇబ్బంది పడుతు న్నట్లు వెల్లడించగా మరికొంతమంది కళ్లు మండుతున్నట్లు ఫిర్యాదు చేశారు. ఇంకొందరు ముక్కు కారటం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నట్లు వెల్లడించారు. ఢిల్లీ రీజియన్ ఎన్సీఆర్‌లో ప్రతి ఐదు కుటుంబాలలో నలుగురు వ్యక్తులు కాలుష్య సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో పరిస్థితి ఇంతగా దిగజారడం శోచనీయం.

## కాలుష్యం అంటే ఏమిటి?

కాలుష్య కారకాలను వాతావరణంలో ప్రవేశపెట్టడాన్ని కాలుష్యం అని అంటారు. ఈజవరాసుల జీవక్రియలను నష్టపరిచే వాతావరణంలోని మార్పులనే కాలుష్యం అని చెప్పవచ్చు. కాలుష్యం అనే పదం పర్యావరణాన్ని లేదా ప్రభావిత వాతావర ణంలో నివసించే జీవులను ప్రతికూలంగా ప్రభావితం చేసే ఏదైనా పదార్థాన్ని సూచిస్తుంది. దీనివల్ల మానవులు, జంతువులు, వృక్ష సంపద మొదలైన సామాజిక ఆస్తులకు నష్టం వాటిల్లుతుంది. కాలుష్య కారకాలు గాలి, నీరు, భూమి నాణ్యతను దెబ్బతీస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహించిన ఒక సర్వే ప్రకారం పర్యావరణ కాలుష్యం వల్ల మన దేశంలోని ఆరు ప్రధాన నగరాలలో ఏటా దాదాపు యాభై వేల మంది మరణిస్తు న్నారని తెలుస్తోంది.

## కాలుష్యంలో అనేక రకాలు

పర్యావరణ కాలుష్యం ప్రధాన వాయు కాలుష్యం, నీటి కాలుష్యం, నేల

కాలుష్యం, ధ్వని కాలుష్యం.. ఇంకా అనేక రకాలుగా ఉంటుంది.

### వాయు కాలుష్యం

వాయు కాలుష్యం అంటే గాలిలోకి కాలుష్య కారకాలను విడుదల చేయడం అని అర్థం. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. కాలుష్య కారకాల వల్ల మానవాళికే కాక ఈ భూగోళం మొత్తానికి ముప్పు వాటిల్లుతుంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం భూమిపై ఉన్న మొత్తం జనాభాలో 90 శాతం ప్రజలు కలుషితమైన వాయువులు పీలుస్తున్నారు. ధూమపానం కూడా కొంతమేరకు కాలుష్యాన్ని పెంచుతుంది. అయితే అంతకంటే వాయు కాలుష్యం వల్ల హెచ్చు మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు అధ్యయనంలో తేలింది. వాయు కాలుష్యం కారణంగా అనేక రకాలైన ఊపిరితిత్తుల, కాలేయ, గుండె సంబంధిత వ్యాధులు, మూత్రాశయ కేన్సర్, మధుమేహం, ఎముకలు పెళుసుబారడం, మనోవైకల్యం వంటి భయంకరమైన వ్యాధులు సంభవిస్తున్నాయి. వేగంగా విస్తరిస్తున్న ఈ కాలుష్యం వల్ల సహజంగానే సమస్త ప్రాణికోటి, వృక్షజాతులు ప్రమాదంలో పడ్డాయి. దేశంలో ఉన్న శాస్త్రవేత్తలు, మేధావులు, స్వచ్ఛంద సేవకులు ఈ సమస్యను అధిగమించడానికి అనేక రకాల ప్రాజెక్టులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఏడు మిలియన్ల మంది వాయు కాలుష్యం బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. వాయు కాలుష్యానికి ప్రధాన కారకాలు అమ్మోనియా, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్, మిథేన్, క్లోరోఫోరో కార్బన్స్ మొదలైనవి. ఇంధనాలను మండించిన పుడు వెలువడే కర్బన వాయువు వాతావరణంలోని ఆక్సిజన్‌తో కలిసి కార్బన్ డై ఆక్సడ్‌గా మారుతుంది. ఆ కారణంగా ప్రాణవాయువు తగ్గిపోతుంది. సూక్ష్మరేణువులు గాలిలో కలపడం వల్ల, ఆ గాలిని మనం పీల్చిన కారణంగా గుండెజబ్బులు, శ్వాసకోశ వ్యాధుల బారిన పడక తప్పదు. ఒక సర్వే ప్రకారం వృద్ధులు అధికంగా మరణించే మొదటి అయిదు దేశాలలో మన దేశం కూడా ఉంది. చిన్నారులు, గర్భిణులు సైతం కాలుష్యం వల్ల అనేక సమస్యలను ఎదుర్కొంటారు. కాలుష్యం ఇదే రీతిలో కొనసాగితే 2050 నాటికి ప్రపంచంలోని ముక్కుపచ్చలారని చిన్నారులు అధిక ఉష్ణోగ్రత ప్రభావానికి గురౌతారని యూనిసెఫ్ హెచ్చరిస్తోంది. వాయు కాలుష్యం చాలా వరకు శక్తి వినియోగం, ఉత్పత్తి నుండి వస్తుంది. దీనికి మోటార్ వాహనాలు ప్రధాన కారణాలలో ఒకటిగా చెప్పవచ్చు. వాయు కాలుష్య విడుదలలో చైనా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, రష్యా, మెక్సికో, జపాన్ దేశాలు ప్రపంచంలో అగ్ర స్థానంలో ఉన్నాయి. ముఖ్య స్థిర కాలుష్య మూలాలు రసాయన ఉత్పత్తి కేంద్రాలు, బొగ్గు మండించడం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే కేంద్రాలు, చమురు శుద్ధి కర్మాగారం, పెట్రో రసాయన ఉత్పత్తి కేంద్రాలు, అణు వ్యర్థాలను నాశనం చేసే ప్రక్రియ, వ్యర్థాలను బూడిదగా మార్చేవి. పివిసి కర్మాగారాలు, మితిమీరిగా బాణాసంచా కాల్చడం, ఖనిజ ఉత్పత్తి కర్మాగారాలు, ప్లాస్టిక్ కర్మాగారాలు, ఇతర భారీ పరిశ్రమలు కాలుష్యానికి కేంద్ర బిందువుగా ఉన్నాయి. వ్యవసాయ సంబంధిత వాయు కాలుష్యం సహజ జీవన సంబంధితాలను నరికివేయడం, కాల్చటం, అదే విధంగా క్రిమిసంహార కాలు, కలుపు సంహారకాలను జల్లటం వంటి వాటి నుండి వస్తుంది. వాయు కాలుష్యం వల్ల అనేక సమస్యలు తలెత్తు



తాయి. శ్వాసకోస వ్యాధులు, హృదయ సంబంధిత వ్యాధులు, అలసట, తలనొప్పి ఆందోళన, కాలేయం, ప్లీహం, రక్తానికి హాని, నాడీ వ్యవస్థ దెబ్బ తినడం.. మొదలైన అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ప్రపంచంలోనే అత్యధిక వాయు కాలుష్యంతో నిండిన నగరం ఢిల్లీ. ఇక్కడ వాయు కాలుష్యం వల్ల ప్రజల ఆయుర్దాయం పదేళ్లు తగ్గిపోతోందని యూఎస్ రీసెర్చ్ గ్రూప్ చేసిన అధ్యయనం తెలిపింది. భారతదేశంలో వాయు కాలుష్యం కారణంగా ఏటా కొన్ని లక్షల మంది మరణిస్తున్నారని అంచనా. ఇప్పుడు ఢిల్లీతో పాటు పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో వాయు కాలుష్యానికి పంట వ్యర్థాలను కాల్చడం ప్రధాన కారణమని తెలుస్తుంది. తరువాత పంట వేసేందుకు అనుకూలంగా పంటవ్యర్థాలను తగలబెట్టడంతో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్నట్లు సర్వేలో గుర్తించారు. ప్రతి సంవత్సరం పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల ఏర్పడే కాలుష్యం, దుమ్ము, ధూళి వల్ల ఢిల్లీ ప్రాంతం తీవ్ర వాయు కాలుష్యానికి గురవుతోంది. పంట వ్యర్థాలను కాల్చరాదని ప్రభుత్వాలు నిషేధం విధించినప్పటికీ అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా ప్రభుత్వ ఉత్తర్వులు సరిగా అమలు కావడంలేదు. మన దేశంలో చెత్తా చెదారాన్ని వదిలించుకోవడానికి పాత పద్ధతులే పాటిస్తున్నారు తప్ప నవీన ధోరణులను అనుసరించడం లేదు. సాధారణంగా చాలా చోట్ల కాల్చివేస్తున్నారు. అందువల్ల అధికంగా మిథేన్ వాయువు వెలువడి కాలుష్యం పెరుగుతోంది. విద్యుచ్ఛక్తి ఆదా చేయడం ద్వారా కూడా వాయు కాలుష్యాన్ని తగ్గించవచ్చు. శుభానికి, అశుభానికి, పండగలు, పబ్బాలు ఇత్యాది కార్యక్రమాల్లో బాణసంచా వాడకాన్ని తగ్గిస్తే వాయు కాలుష్య నివారణకు దోహపడినవారమౌతాం. చెట్లను ఎక్కువగా నాటాలి. ఇవి వాయు కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రధాన భూమికలను నిర్వహిస్తాయి.

### నీటి కాలుష్యం

మానవ మనుగడకు గాలి ఎంత అవసరమో నీరు కూడా అంతే ముఖ్యం. ప్రతీ మనిషి శరీరంలో హెచ్చుశాతం నీరు ఉంటుంది. గాలి తరువాత నీరే కలుషిత మవుతోంది. పవిత్రమైన నదులు, ఏరులు, చెరువులు, సరస్సులు, కాలువలతో పాటు చివరకు భూగర్భ జలాలు సైతం కాలుష్యం బారిన పడుతున్నాయి. ఇప్పటికే 60 శాతం నీటి వనరులు కలుషితమైనాయని అంచనా. ఈ పరిస్థితులను మార్చకపోతే 2050 నాటికి ఈ భూమిపై నీరంతా విషతుల్యం అవుతుందని అంచనా. రసాయనిక ఎరువులు, తోళ్ల పరిశ్రమ, ప్లాస్టిక్, క్రిమిసంహారక మందులు,

బ్యాటరీ ఇత్యాది పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థ జలాలు అనేకచోట్ల నదులలో కలిసి నీరు కలుషితమౌతుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నివేదిక ప్రకారం దేశంలో రోజుకు 26 వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్ర జలాలను కలుషితం చేస్తున్నాయి. వందలాది ఏళ్ల వరకు కరగని ప్లాస్టిక్ వ్యర్థాలు భూగర్భ జలాలను కలుషితం చేస్తూ భూమిలో నీరు ఇంకకుండా అడ్డుపడుతున్నాయి. కోట్లాదిమంది ప్రజలు కలుషితమైన నీరు తాగడం వల్ల విష జ్వరాల బారిన పడి మరణిస్తున్నారు. వీరిలో ముక్కుపచ్చలారని అయిదేళ్ల చిన్నారులు ఉండటం హృదయాన్ని కలచివేస్తుంది.

మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి మనకు తెలియంది కాదు. నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు ఇత్యాదివి కొన్ని ప్రాంతాలలో పవిత్ర నదులలో కలుస్తున్నాయి. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోతున్నాయని పరిశీలకుల అంచనా.

పవిత్రమైన గంగానది సుమారు 1760 కి.మీల. మేర కలుషితమై ప్రపంచంలోనే అత్యంత పొడవైన కలుషిత నదిగా మారడం శోచనీయం. గంగా పరీవాహక ప్రాంతంలో కోట్లాది మంది ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పది వేల కోట్లు కేటాయించి 'గంగానది ప్రక్షాళన' పేరుతో కేంద్ర జల వనరుల సంఘం ఆధ్వర్యంలో నివారణా చర్యలు చేపట్టింది. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్ప బద్ధులం కావాలి. చివరకు సముద్ర జలాలు సైతం కలుషితమైపోతున్నాయి. చమురు రవాణా నౌకలు సముద్రంలో ప్రమాదవశాత్తు మునిగినప్పుడు ఆ చమురుతో సముద్ర జలాలు కలుషితమైన సందర్భాలు అనేకం ఉన్నాయి.

## నేల కాలుష్యం

నేల కాలుష్యం కావడానికి అనేక కారణాలు ఉన్నాయి. పారిశ్రామిక వ్యర్థాలను మట్టిలోకి విడుదల చేయడం, కలుషితమైన నీటిని మట్టిలో ప్రవేశించేలా చేయడం, రసాయన ఎరువులు, కలుపు మొక్కల



నాశకాలను అధికంగా వాడటం ఇత్యాది కారణాల వల్ల నేల కాలుష్యం ఏర్పడుతుంది. పుణ్యదాయిని, పవిత్రమై నదిగా భావించే భూమిని మనిషి తన ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నారు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నారు. వాడిపారేసిన కంప్యూటర్లు, సెల్‌ఫోన్స్ వంటి వాటిలో పాదరసం, కాడ్మియం, బేరియం, సీసం, పాలీక్లోరినే టెడ్ బైఫినైల్ వంటి వెయ్యికి పైగా హానికార రక రసాయనాలు ఉంటాయి. ఈ హానికార రక రసాయనాల ప్రభావంతో కాలేయం, గుండె, కిడ్నీ, మెదడు, ఎముకల జబ్బులు తలెత్తవచ్చు. గర్భిణులు వీటి ప్రభావానికి గురైతే తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం, పుట్టుకతోనే శిశువు మరణించడం, శిశువులు డీఎన్ఏ సమస్యలతో పుట్టే అవకాశం ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాల్లో ఎన్నో రసాయనాలు ఉంటాయి. ఇవి తేలికగా నీటిలోకి, మట్టిలోకి చేరుకుంటాయి. ఇలా నీరు, ఆహార పదార్థాల ద్వారా ఒంట్లోకి ప్రవేశించి, హార్మోన్లతో ముడిపడిన కేన్సర్లకు దారి తీయవచ్చు. ప్లాస్టిక్ కాలుష్యం ప్రమాదానికి సంకేతం. పెస్టిసైడ్స్ వాడకం నేలలో సాధారణ జీవ వైవిధ్యాన్ని తగ్గిస్తుంది.

## ధ్వని కాలుష్యం

రోజు రోజుకూ పెరిగిపోతున్న వాహనాల వల్ల వాయు కాలుష్యంతో పాటు ధ్వని కాలుష్యం కూడా పెరిగిపోతుంది. కొన్ని రకాల భారీ పరిశ్రమల యంత్రాల వల్ల కూడా ధ్వని కాలుష్యం పెరిగిపోతోంది. నిరంతరం పెద్ద శబ్దాలకు గురవటంతో తలెత్తే ధ్వని కాలుష్యం ప్రజల్లో చికాకుతో పాటు రక్తపోటు పెరిగేలా చేస్తుంది. శబ్ద కాలుష్య వినికిడి, శ్రవణ జ్ఞాన సంబంధ అవయవాలపై ప్రతికూల ప్రభావాలను కలిగించటం వల్ల చెవుడు, అలసట, మానసిక ఒత్తిడి అధికమై పలురకాల మానసిక అనారోగ్య సమస్య లను సృష్టిస్తుంది. ఇది క్రమంగా గుండెజబ్బులకు దారి తీయవచ్చు. బహిరంగ ప్రదేశాల్లో 50 డెసిబుల్స్‌కి మించని ధ్వని ఆరోగ్యరమైనదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు తెలుపుతున్నాయి. ధ్వని కాలుష్యం వల్ల అధిక రక్త పోటు, తలనొప్పి, మెదడు, నాడీ వ్యవస్థ క్రమంగా దెబ్బతిని చికాకు పెరగ డం, నిద్రలేమి, తొందరగా అలసిపోవడం, చెవులలోని కర్ణభేరీ చిట్లి వినికిడి శక్తి లోపించడం, నరాలపై తీవ్ర ప్రభావం ఇత్యాది చెడు ప్రభావాలు ఉన్నాయి.

ప్రపంచంలోనే అత్యధిక కాలుష్యభరిత రాజధానిలో ఢిల్లీ మొదటి స్థానంలో నిలిచిందన్న మాట ఆందోళన రేపుతోంది. వరుసగా నాలుగో ఏడాది ఢిల్లీకి ఈ అపకీర్తి దక్కడం పరిస్థితి తీవ్రతకు దర్పణం. ఢిల్లీలో వాయు కాలుష్యం పెరగడంతో చాలా పరిశ్రమలను తాత్కాలికంగా మూసివేశారు. వాయు కాలుష్యం ప్రజారోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. కాలుష్యంతో ప్రతి నిమిషానికి ముగ్గురు ప్రాణాలు కోల్పోతుంటే గుండె, ఊపిరితిత్తుల వ్యాధుల సహా అనేక అనారోగ్య సమస్యలతో జనం సతమతమవుతున్నారు. గతేడాది చెన్నై మినహా మెట్రో నగరాల్లో కాలుష్య స్థాయి విపరీతంగా పెరిగింది. మన దేశంలోని హర్యానాలోని ఫరీదాబాద్, జింద్‌హిసార్, ఫతేహాబాద్, బంధ్‌వారీ, గురుగ్రాం, యమునా నగర్, రోహ్‌తక్, ధారూహెడా. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్, బులంద్ షహార్, బిసరఖ్ జలాల్‌పూర్, నోయిడా, గ్రేటర్ నోయిడా, కాన్పూర్, లక్నో, మీరట్, ఆగ్రా, ముజఫర్‌నగర్, రాజస్థాన్‌లోని భివారి, బీహార్‌లోని ముజఫర్ పూర్ ఇత్యాది నగరాలలో కాలుష్యం హెచ్చుగా ఉన్నట్లు గుర్తించారు. తెలంగాణలోని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ పట్నం వంటి అనేక నగరాలు, పట్టణాలు కాలుష్యానికి చేరువ కావడానికి పరుగులు తీస్తున్నాయి. వాతావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి.

ప్రపంచంలోని అనేక దేశాలలో వరదనీరు విలయతాండవం చేయడంతో ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లుతుంది. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రత వల్ల ధ్రువ ప్రాంతాలలో మంచు కరిగి సముద్రమట్టం పెరగడం ఆందోళనను కలిగిస్తుంది. గత 30 సంవత్సరాలలో ప్రపంచ వ్యాప్తంగా గ్రేసియర్స్, పర్వత శ్రేణుల్లోని హిమానీ నదాలతో పాటు అంటార్కిటికా ధ్రువ ప్రాంతంలో 148 బిలియన్ టన్నుల మంచు కరిగి ఆ నీరంతా సముద్ర జలాల్లో కలిసిన కారణంగా గత 20 సంవత్సరాల లో సముద్ర మట్టాలు దాదాపు 8 అంగుళాలకు పెరిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే ఉప్పునీరు పంటపొలాల్లో చేరి పంటలు పండవు. మన దేశంతో పాటు పొరుగున ఉన్న బంగ్లాదేశ్ పాకిస్థాన్‌తో పాటు యూరప్‌లోని అనేక దేశాలలో వరదలు పోటెత్తితే చైనాలో కొన్ని నదులు ఎండిపోయాయి. మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాల లో వరదలు ముంచెత్తితే, ఇందుకు భిన్నంగా అనేక ప్రాంతాలలో వర్షాలు లేక పంటభూములు సైతం బీడు భూములుగా మారిపోయాయి. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియాలలోని కొన్ని ప్రాంతాలలోని అడవులలో కార్చిచ్చులు లక్షలాది ఎకరాల లోని పచ్చని చెట్లను బుగ్గిపాలు చేశాయి. ఉత్తర అమెరికాలో వడగాలులు భారీ స్థాయిలో ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించాయి.

అటవీ నిర్మూలన కూడా పర్యావరణ కాలుష్యానికి దారి తీస్తున్నది. ఈ విధంగా జీవులు జీవించడానికి అత్యవసర వనరులైన గాలి నీరు కాలుష్యానికి గురి అవుతున్నాయి. పర్యావరణ కాలుష్యం మానవులు, జంతువుల జీవితంపై ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. వృక్షజాలం, జంతుజాలం అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఆధునిక పట్టణీకరణ, ప్రపంచీకరణ, పారిశ్రామికీకరణ, ఆధునిక సైన్స్ అండ్ టెక్నాలజీ యుగంలో అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థికాభివృద్ధి పేరుతో పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నారు.

పర్యావరణ కాలుష్యం ఎక్కువై ప్రపంచ మానవాళి పలు అనారోగ్య సమస్యల వలయంలో చిక్కుకోవటమే కాకుండా మార్కెట్లో మానవ వనరుల కొరతకు దారి తీస్తుంది. పారిశ్రామిక వ్యర్థాలను ఇబ్బడి ముబ్బడిగా పడేయడం వల్ల సిరులు పండే నేల, జీవనాధారమైన నీరు కాలుష్యమౌతుంది. వాహనాలు, ఫ్యాక్టరీలు వదిలే పొగ, పెట్రోల్, డీజిల్, వంటబొగ్గు ఉపయోగించడం వల్ల విడుదల చేసే పొగ పర్యావరణ కాలుష్యం చేస్తున్నాయి. ఈ విధంగా కర్బన్ వాయువులు ఎక్కువ కావడంతో వాయు కాలుష్యం ఏర్పడి వాతావరణంలో మార్పులు జరుగుతున్నాయి. విపరీతంగా జనాభా పెరిగిపోవడం కూడా కాలుష్యానికి ప్రధాన కారణమని చెప్పవచ్చు. సల్ఫర్ డై ఆక్సైడ్, ఫ్లోరిన్, క్లోరిన్, కార్బన్ డై ఆక్సైడ్, హైడ్రోజన్, అమ్మోనియం వంటి వాయువులు; ఇనుము, పాదరసం, సీసం, జింకు వంటి మూలకాలు; ఫ్లోరైడ్ లాంటి రసాయన పదార్థాలు, కృత్రిమ ఎరువులు, హెర్బిసైడ్లు, రేడియో ధార్మిక పదార్థాలు, అధిక ఉష్ణం, అధిక ధ్వని.. ఇవన్నీ కాలుష్యానికి కారకాలే. న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌లు, ఆయిల్ ట్యాంకర్లు, ప్రమాదాలు జరిగినప్పుడు అత్యధిక స్థాయిలో కాలుష్యాన్ని విడుదల చేయవచ్చు. తీర ప్రాంతపు చమురు శుద్ధి కర్మాగారాలకు జరిగిన నష్టం నుండి కూడా ఈ కాలుష్యం సంభవిస్తూ వుండడం సామాన్యమైన విషయమే. అణు పరీక్షలు, పరిశ్రమలు, ఆటోమొబైల్ ఇతర వాహనాల ద్వారా వదిలివేయబడిన పొగ, సింథటిక్ డిటర్జెంట్లు, నత్రజని ఎరువులు అధిక దిగుబడులు పేరు మీద వ్యవసాయ రంగంలో పంట పొలాల్లో కూరగాయలు, పాడిపంటల ఉత్పత్తిలో విచ్చలవిడిగా వాడుతున్న పురుగుమందుల వినియోగం వల్ల భూమి ఉత్పత్తి సామర్థ్యం క్షీణించడమే కాకుండా భూగర్భ జలాలను కూడా కలుషితం చేస్తుంది.

చాలా నగరాలలోని ప్రజలు వాయు కాలుష్యం, నీటి కొరతలతో బాధపడుతున్నారు. మన దేశంలో సుమారు 60 కోట్ల మంది నీటి కోసం సజీవంగా పారే నదులపై ఆధారపడి ఉన్నారు. ఈ నదుల నిరంతర ప్రవాహంపై ఇప్పుడు సందేహాలు వస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరడంతో హిమాలయాల్లోని మంచుగడ్డలు కరిగిపోతున్నాయి. ఇది నదుల ఉనికికే ప్రమాదం కలిగింపచేస్తుంది. భూగర్భ జలాలు కూడా నదుల ఉనికికి కారణమవుతాయి.

కొత్త అడవులను అభివృద్ధి చేస్తామని, చెట్లను పెంచడం ద్వారా నివాస ప్రాంతాలలో కార్బన్ సింక్ వ్యవస్థను శుద్ధి చేస్తామని అంతర్జాతీయ వేదికలపై మన ప్రభుత్వాలు చెప్పడం జరిగింది. వీటిని అమలు చేయడంలో కొంత ప్రగతిని మనం సాధించగలిగినా చేయాల్సిన కృషి ఎంతో ఉంది. హామీ ఇచ్చిన వాటిని యథాతథంగా అమలు చేస్తే ఆరోగ్యం కోసం ప్రజలు ఖర్చు పెట్టే ధనాన్ని మిగుల్చుకోవచ్చు.

### కాలుష్యం వల్ల వచ్చే వ్యాధులు

కాలుష్యం పెరిగిపోవడం వల్ల ప్రజలు అనేక రకాల వ్యాధులకు గురౌతున్నారు. మధుమేహం, అధిక రక్తపోటు, గుండెజబ్బులు, కాలేయ జబ్బులు వంటి సమస్యలకు ఎలాంటి పరిశ్రమలు, ఏయే కాలుష్య కారకాలు, ముడి పదార్థాలు దోహదం చేస్తున్నాయనేది కచ్చితంగా తెలియదు. ఇది శ్వాస ద్వారా తేలికగా ఊపిరితిత్తుల లోపలి భాగాలకు చేరుకుంటుంది. ఆక్సిజన్,



కార్బన్ డై ఆక్సైడ్ మార్పిడి అయ్యే గాలి గదుల వరకు చొచ్చుకుపోవచ్చు. కాలుష్య కారకాలు రక్తం ద్వారా శరీరంలోని ఇతరత్రా భాగాలకు చేరుకోవచ్చు.

ఇది పూడికలకు, రక్తనాళాల లోపలి మార్గం సన్నబడటానికి దారి తీసింది. దీంతో రక్తపోటు పెరిగి, క్రమంగా గుండెపోటు, పక్షవాతం వంటి జబ్బుల ముప్పు పెరుగుతుంది. ఆయా భాగాలలో వాపు ప్రేరేపితం కావటం వల్ల కాలేయ జబ్బులు, కేన్సర్లు వంటివి తలెత్తొచ్చు. గాలి కాలుష్యంతో సంతాన లేమి, అల్జీమర్స్ కూడా తలెత్తవచ్చు. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు ఊపిరితిత్తుల బలహీనత, క్షయతో పాటు వివిధ రకాల మెదడు, గుండె సమస్యలు పెరుగుతున్నాయి.

వాయు కాలుష్యం పెరిగి తీవ్రమైతే ఊపిరితిత్తుల వ్యాధులు, ఉబ్బసం, మెదడు రక్తం గడ్డ కట్టడం, కంటిచూపు మందగించడం లాంటి రుగ్మతలు ఎక్కువ అవుతున్నాయని అనేక ఆరోగ్య సర్వేలు వెల్లడించాయి.

## నివారణ చర్యలు

వ్యక్తిగత పరిశుభ్రత, మాస్కుల వాడకం, రక్షణ పరికరాలు ధరించడం, కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలు పాటించడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చు. చుట్టూ ఉండే పరిసరాలపైనే మనిషి ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా పీల్చుకునే గాలి, తాగే నీరు కలుషితం కాకుండా తీసుకోవలసిన బాధ్యత మన అందరిది. అందులో భాగంగానే ప్రతిఒక్కరు ఇంటి పరిసరాలలో మొక్కలు నాటాలి. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించాలి. సేంద్రియ సాగు వైపు నడవాలి. కాచి, చల్లార్చిన, శుద్ధి చేసిన నీళ్లనే తాగాలి. కాలువలు, నదుల్ని శుభ్రంగా ఉంచాలి. గాలి కాలుష్యాన్ని తగ్గించడానికి ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించడం, అలాగే కట్టెల పొయ్యిల నుంచి వచ్చే పొగ, బట్టలు ఉతకడానికి వాడే డిటర్జెంట్లు కూడా భూమిని కలుషితం చేస్తాయి. కర్బన వాయువుల విడుదలకు రవాణా వ్యవస్థ కూడా ఒక ప్రధాన కారణం. కాబట్టి వ్యక్తిగత వాహనాల వాడకాన్ని తగ్గించి ప్రజా రవాణాను వినియోగించాలి. అందుకే సాధ్యమైనంతవరకు సహజ ఉత్పత్తులనే వాడాలి. గృహ, వ్యవసాయ అవసరాలకు సౌర విద్యుత్తును తయారు చేసుకోవాలి. అప్పుడే మనతో పాటు సమస్త భూగోళం ఆరోగ్యంగా ఉంటుంది. 2021 తరువాత ఎక్కడా థర్మల్ విద్యుత్ కేంద్రాలు నెలకొల్పకూడదని, 2030 నాటికి ఉన్న కేంద్రాలను మూసివేయాలని ఐక్యరాజ్య సమితి గతేడాది ప్రకటించింది. మన దేశంలో పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చుకోవడానికై విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 2032 వరకు 28 గిగావాట్ల సామర్థ్యం గల థర్మల్ ప్రాజెక్టు నిర్మాణంలోనూ ప్రతిపాదనలు ఉన్నాయి. పర్యావరణ కాలుష్య సమస్యను పరిష్కరించడానికి భవిష్యత్తులో ప్రభుత్వాలు కర్మాగారాలను జనావాసాలకు సుదూర ప్రదేశంలో, టౌన్‌షిప్‌కు దూరంగా ఉన్న పారిశ్రామిక సముదాయంలో ఏర్పాటుకు చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలి. పరిశ్రమలు నిబంధనలు పాటించాలి. అందుకై ప్రభుత్వం కఠినమైన చర్యలు చేపట్టాలి. పర్యావరణ కాలుష్యం కలిగించని పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలి. నదీజలాలను కాలుష్యం లేకుండా చేయడానికి ఫ్యాక్టరీ వ్యర్థాలను నదుల్లోకి వదిలేయడాన్ని నిషేధించాలి. అడవుల నరికివేతను అరికట్టి అడవులను అభివృద్ధి చేయాలి. ఒక చెట్టు జీవిత కాలంలో టన్ను కార్బన్ డై ఆక్సైడ్ పీల్చుకుంటుంది. అందువల్ల ప్రతి ఇంటికీ ఒక చెట్టును విధిగా నాటాలి.

పర్యావరణ కాలుష్య ప్రపంచ వ్యాప్తంగా సమస్యగా మారింది. ప్రభుత్వాలు అవలంభిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక విధానాలు ప్రకృతి విధ్వంసానికి కారణాలు అవుతున్నాయి. ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డై ఆక్సైడ్, ఆర్గాన్, నీటిఆవిరి సమతుల్యంగా ఉండాలి. ఈ సమతుల్యత జల వలయం సాధారణ వర్షపాతం, జంతువుల, మొక్కల జీవిత చక్రాలకు సహాయపడతాయి.

పర్యావరణ సమతుల్యం వన్యప్రాణి, వ్యవసాయానికి మానవుని అభివృద్ధికి సహాయ పడుతుంది. మనం ప్రస్తుతం పర్యావరణ సమతుల్యతను పునరుద్ధరించడంలో విఫలమైతే మానవులు భూగ్రహం పైన నివసించడం అసాధ్యం అవుతుందని తెలుసుకోవాలి. ప్రపంచ స్థాయిలో వాయు కాలుష్యాన్ని పర్యవేక్షించడానికి, అధ్యయనం చేయడానికి, సాధ్యమైన నివారణలను రూపొందించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను, పరిశోధన అభివృద్ధి శిక్షణ సంస్థను ఏర్పాటు చేసింది.



మిత్ర దేశాలను ఒకచోట చేర్చి 2050 నాటికి కాలుష్య రహిత భూగోళాన్ని రూపొందించుకోవాలనే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. ఈ దిశగా ప్రపంచ మానవాళి కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో సంపూర్ణ భాగస్వాములు కావాలని ఆశిద్దాం. ప్రభుత్వాలు ప్రజల సహకారం లేకపోయినట్లయితే ఎన్ని చట్టాలు రూపొందించినా ప్రయోజనం అనుకున్నంత ఉండకపోవచ్చు. పర్యావరణ సమతుల్యతను సంరక్షించుటకు ప్రజల సామాజిక బాధ్యత నిరంతర ప్రజా చైతన్యం పర్యావరణ పరిరక్షణలో కాలుష్య రహిత అభివృద్ధి సాధనలో కీలక పాత్ర పోషిస్తుంది.

మీడియా ప్రసార సాధనాలు ఎలక్ట్రానిక్ మీడియా పర్యావరణ ప్రకృతి రక్షణ కాలుష్య నియంత్రణ విధానాల వల్ల ప్రజలను చైతన్యపరవచ్చు. మన దేశంలోనే కాకుండా ప్రపంచమంతటా కాలుష్యానికి వ్యతిరేకంగా ఉద్యమాలు పోరాటాలు కొనసాగినప్పటికీ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం, పాలకుల్లో, ప్రజా ప్రతినిధుల్లో పర్యావరణ పరిరక్షణ చట్టాల మీద పరిజ్ఞానం లేకపోవడం, నిర్లక్ష్య ధోరణి, ఉదాసీనత రాజ్యం ఏలవడం కాలుష్యం పెరిగి మానవ మనుగడకు సవాల్‌గా పరిణమించింది.

ఇటీవల 158 దేశాలకు చెందిన 1500 మంది శాస్త్రవేత్తలు కాలుష్యంపై పరిశోధనలు చేసి ప్రపంచ దేశాల విధానాలన్నీ భూతాపాన్ని మూడు డిగ్రీల సెంటీగ్రేడ్ పెరిగేలా చేస్తున్నాయని తేల్చి చెప్పారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని భావితరాలవారి ఆరోగ్య భవిత కోసం మనం చేతనైన మంచిని చేసి కాలుష్యం తగ్గే పనులు చేయాలి. ఈ నేపథ్యంలో మనం కూడా మానవత్వంతో ఆలోచించి భావి తరాలవారి మనుగడ సుఖంగా సాగేలా కొంతమేరకు కృషి చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. లేదంటే భావితరాలవారు ఈ తరాన్ని ఎప్పటికీ క్షమించరు. కాలుష్య భూతం వల్ల జీవకోటి మనుగడకే ప్రమాదం కాబట్టి ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. కాలుష్య నియంత్రణలో వర్తమాన విధానం విఫలమైనందున సరికొత్త వ్యూహరచన చేయాలి. తాజా నివేదికలో సిఫార్సు చేసినట్టుగా వ్యక్తిగత వినియోగానికి కాలుష్య రహిత స్వచ్ఛ వాయు వాహనాలను వాడేవారికి ప్రోత్సాహకాలు ఇచ్చేలా చట్టాలు చేయడం లాంటివి ఆలోచించాలి. అన్ని దేశాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన నూతన మార్గదర్శకాల సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయవలసిన అవసరం ఉంది. గాలి నాణ్యతను మెరుగుపరచడం వల్ల వాతావరణం తేటపడుతుంది. అంటే ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయి. పర్యావరణానికి మేలు జరుగుతుందని ప్రభుత్వాలు గుర్తించి చిత్తశుద్ధితో కృషి చేస్తే మానవులకే కాక సమస్త జీవకోటికి ప్రయోజనం చేకూరుతుంది. చట్టాలు ఎవరికీ చుట్టాలు కాకూడదు. వాటిని కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు అన్ని రకాల వనరులను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అందరిలో అవగాహన పెంచి ఈ భూగోళంపై నివసిస్తున్న సమస్త జీవరాశులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ దోహదపడాలి. ❑

## 'ఆనాటి రోజుల్లోకి' ఆనందవిహారం



అల్లంరాజు రాధాకుమార్ (కలంపేరు రాధాయి) అప్పుడప్పుడు రాస్తుంటారు. ఒకప్పుడు తరచుగా రాసేవారు. ముక్కాని, ఆంధ్రజనత (దినపత్రిక) విశ్వరచన యువభారతిలాంటి ' జాతీయపత్రి'కలలో తమ కవితలు, కథలు గల్పికలు వ్యాసాలు, కార్టూనులతో సాహితీప్రియులను అలరించే వారు. 'గుసగుసలు' అన్న శీర్షికతో 1972-74లో ప్రచురించిన కాలమ్ రచనలు విశేష జనాదరణను పొందాయి. వీరు ప్రముఖ సాహితీవేత్త రేడియో ప్రయోక్త సుధామ, అల్లంరాజు వెంకటరావు అగ్రజులు. రాధాయి లోగడ రాసిన రచనలన్నింటినీ, గుదిగ్రుచ్చి 'ఒక సంపుటి' రూపంలో పాఠకులకందిస్తోన్న ప్రయత్నమిది. ప్రముఖ అనువాదకులు ద్విభాష్యం రాజేశ్వరావు సుధామల ముందు మాటలతో రచయిత తన అనుభవాల్ని ఆంతర్యాన్ని మనతో పంచుకుంటున్నారు. 'మా దిక్చూచి' అన్న శీర్షిక (పే 110)తో రచయిత వివరించిన తన జీవితం, ఈ సంపుటికే హైలైట్‌గా పేర్కొనవచ్చు. నాటి హైదరాబాదు, జీవితం, ఆర్థిక, సామాజిక రాజకీయ స్థితిగతులకు ఈ వ్యాసం అద్దం పడుతుంది.

సాహిత్యకార్యకలాపాల్లో ఆరితేరిన కుటుంబం నుంచి వచ్చిన రచయిత కనుక రాధాయి రచనలు వివరంగా, విపులంగా ఉన్నాయి. విడవకుండా చదివిస్తాయి.

**(ఆరోజుల్లో..రచన: అల్లంరాజు రాధాకుమార్, వెల: రూ150, ప్రతులకు: అన్ని ప్రముఖబుక్‌హౌస్‌ల్లో)**

**- కూర చిదంబరం**

## డా॥టి.శ్రీరంగస్వామి 'పలుకు జెలి'




డా॥టి.శ్రీరంగస్వామి వచన కవిగా, సాహితీ పరిశోధకునిగా, వ్యాస, కథా రచయితగా సుప్రసిద్ధులు. పలుకుకు చెలి అయిన, అమ్మ పేరిట, 'పలుకు జెలి' సాహిత్య విమర్శవ్యాస సంపుటి శ్రీలేఖ సాహితీ ప్రచురణలలో 136 పుస్తకం ప్రచురింపచేసారు. సామాజిక భాషాసాహిత్యాలకు సంబంధించిన ఈ సంపుటిలో 16 వ్యాసాలు, శ్రీరంగస్వామి, సాహిత్య సృజనాత్మక ప్రతిభకు, అధ్యయనాభిరుచికి అద్దం పడుతున్నాయి. తెలంగాణ సాహితీసీమలో లబ్ద ప్రతిష్ఠులైన రచయితలు, గతంలోని కవులు, ఉద్యమసాహితీవేత్తలు వినూత్న సాహితీ ప్రాశంస్త్యంతో తెలుగును సుసంపన్నం చేసారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన మహోదయంలో అస్తిత్వ ఆకాంక్ష, చరిత్ర, సంస్కృతి, సాహితీ మహోన్నతా విలువలపై వెన్నెల వెలుగులు ప్రసరింపచేస్తోంది. శ్రీరంగస్వామి అధ్యయన శీలిగా, ప్రతిభావంతుడైన రచయితగా ప్రతీ వ్యాసంలోనూ కొత్త కోణాలు దర్శింపచేసారు. నిర్లక్ష్యం, నిర్లిప్తత, పక్షపాత దృష్టి కారణంగా యింతవరకు వెలుగుచూడని నిక్షిప్తసాహితీమూర్తుల చరిత్రను తెరపైకి తీసుకొని రాడంలో శ్రీరంగస్వామి కృతకృత్యత సాధించారని 'పలుకు జెలి' స్పష్టం చేస్తోంది. ప్రాచీనత నుంచి ఆధునికత, వర్తమానం వరకు ఈ సువిమర్శనాత్మక వ్యాససంపుటిలో తెలంగాణ స్వాతంత్ర్యోద్యమ సాహిత్యం, శిక, కథా, పదకోశ, లక్షణ కర్తల విశేషాలు, కొమర్రాజు, మాడపాటి, యం.ఎస్.ఆచార్య, సువరం, దాశరథి, దేవులపల్లి, దూఆణి, రావి, పి.వి.వంటి మహనీయుల ప్రస్తావనలున్నాయి. **(పలుకు జెలి, రచన: డా॥టి.శ్రీరంగస్వామి, వెల: రూ 100, ప్రతులకు: నవచైతన్య బుక్‌హౌస్)**

**- యర్రమిల్లి**

## పుస్తక సమీక్ష

## 'సుమసోయగాల అక్షర సుగంధం'



పూలతత్త్వాన్ని, నర్సరీ ఉద్యమాన్ని విశ్వమంతా వ్యాపింపజేసిన పుష్పప్రేమికులు పల్ల వెంకన్నకు ఈ 'సుమ సోయగాలు' కవితా సంపుటి అంకితం చేసారు పొత్తూరి సుబ్బారావు. డా॥కె.వి.రమణాచారి, చిలూకూరి శ్రీనివాసరావు, 'పూలు' గురించి మాట్లాడిన వారుగా చైనా కమ్యూనిస్ట్ నేత మావో, జంధ్యాల పాపయ్యశాస్త్రి, జలజం సత్యనారాయణ, దేవులపల్లి కృష్ణ శాస్త్రి నుండి తెలుగు సినీగీత కర్తలెందరో పూలపై అద్భుత సాహి త్యాన్ని సృష్టించారు. పూల ప్రేమికులు కాని కవులుండరు. దాదాపు 50కిపైగా పూలపై పొత్తూరి వారి కలం చక్కటి పరిమళ భరితమైన కవిత్వాన్ని సృజించింది. ఈ కవితలన్నీ ప్రముఖ పత్రికల్లో ప్రచురణై పాఠకుల ఆదరణ పొందినవే. యాభై కవితలూ సమీక్షిం చాల్సినవే. 'పూల పరిమళాలు' గురించి రాస్తూ కవి స్పందనలో మార్కెట్ ఎకానమీని తట్టిచెప్పారు. పూలను కొనుగోలు చేయకున్నా సరే/ కాసేపక్కడ పూలు చిందించే.. గుబాళింపులను ఆస్వాదిస్తే/ సొమ్మేదీ పోదు/ పూలపరిమళాలకు వెలకట్టి- వ్యాపారులింకా పుట్టుకు రా లేదు' అంటారు. వివిధ దేశాల్లో గులాబీ ఎలా వెలుగొందిందీ పురాణ కావ్యాల్లో షెల్లీ, షేక్స్‌పియర్, గ్రీకుకథల్లో ఎన్నెన్నో వర్ణాలతో గులాబి గుబాళింపు లెన్నింటినో పూలరాణి కవితలో కవి అద్భుతంగా వర్ణించారు (పేజి 31). **(సుమ సోయగాలు, రచన: పి.సుబ్బారావు, వెల: రూ100, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లల్లో)** **- తంగిరాల చక్రవర్తి**

## కిట్టన్న కవిత్వం-వస్తు వైవిధ్యం పుష్కలం



డా.నెమిలేటి కిట్టన్న ద్వితీయ కవితాసంపుటి 'అక్షరాల కొలిమి'. దళిత శ్రామిక కుటుంబంలో పుట్టిన రాయలసీమ కవి కిట్టన్న. అందుకేనేమో సీమను పట్టి పీడిస్తున్న కరువు కాటకాలు, వర్గకక్షలు గురించి రాసిన కవితల్లోని అక్షరాల కొలిమిలో మండుతున్న నిప్పుకణికల్లా ఎగిసిపడ్తాయి. కరోనా మహమ్మారి వలన మానవ సంబంధాలు చెల్లాచెదురైన వైనాన్ని 'ఇలాంటి రోజుకటి వస్తుందనుకోలా' కవితలో కడు వివరణాత్మకంగా వ్యక్తీకరించాడు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతని తెలియజేస్తూ, మరీ ముఖ్యంగా పచ్చదనాన్ని పంచే చెట్లను సంరక్షించుకుందామంటూ పిలుపునిస్తాడు. ప్రపంచీకరణ దుష్ఫలితాల్ని ఎత్తి చూపిన కవితల్ని మనముందుంచుతాడు. కిట్టన్న కవిత్వంలో Nostalgia పాళ్ళెక్కువ. 'జ్ఞాపకాల పొట్లం', 'మధురజ్ఞాపకం', 'నాబడిశోకం' కవితల్ని చదవండి. మీరే ఒప్పుకుంటారు. మహాకవి గుంటూరు శేషేంద్ర శర్మకు 'ఈదేశ మట్టిలో పిడికెడు మట్టైన వాడా' అంటూ కీర్తిస్తాడు. జాతినిర్మాణం దిశగా కవుల బాధ్యతను గుర్తుచేస్తూ కొన్ని ప్రబోధాత్మక కవితల్ని ఈ సంపుటిలో ఆస్వాదించవచ్చు. సంపుటిలోని 46 కవితలు చదివింతర్వాత వస్తుబలం, వస్తు వైవిధ్యం పరవాలేదనిపిస్తుంది. కవిత్వ నిర్మాణం పట్ల మరింత శ్రద్ధ అవసరమనిపిస్తే అది పాఠకుడి తప్పుకాదు. **(అక్షరాల కొలిమి, రచన: డా.నెమిలేటి కిట్టన్న, వెల: రూ 150, ప్రతులకు: 6-240, నెమిలేటి వారి నిలయం, హరిపురం కాలని, పేరూరు పోస్టు, తిరుపతి రూరల్)** **- రమణ వెలమకన్ని**



# బాబోయ్ వీటిని కొనలేం?

**వేద వారి నుండి ధనవంతుల వరకూ ప్రాణమున్న ప్రతీ మనిషికి కూరగాయలు ప్రతిరోజూ అవసరం. కూరగాయల కోసం మార్కెట్‌కి వెళితే కిలో 50 రూపాయలు అంటే అమ్మో! అనుకుంటాం. కొన్ని సందర్భాల్లో కిలో కూరగాయలకు 80 నుండి 100 రూపాయలు కూడా ఖర్చు చేస్తాం.**

అయితే ఒక కూరగాయ ధర కిలోకు 85 వేల రూపాయలు అంటే నమ్ముతారా? ఇడెవడండీ బాబూ. కిలో కూరగాయ 85 వేల రూపాయలు అంటున్నాడు, వీడికేమైనా మెంటలా అని తక్కున అంటారు ఎవరైనా. ఈ కూరగాయ ధర అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో అక్షరాల 85 వేల రూపాయలు.

వినడానికి ఆశ్చర్యంగా, అభూతకల్పనగా ఉన్నా ఇది నిజం. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన కూరగాయగా హాప్ షూట్స్ గుర్తింపు పొందింది. ఇది ఎక్కువగా యూరప్, నార్త్ అమెరికా దేశాల్లోనే పండిస్తారు. దీని ధర అంతర్జాతీయ మార్కెట్‌లో 85 వేల రూపాయలకు పైబడి పలుకుతోంది. కొన్ని సందర్భాల్లో దీని ధర లక్ష రూపాయలకు కూడా చేరుకోవడం విశేషం.

హాప్ రెమ్మలు, కొమ్మలు ఆకుపచ్చ రంగు, కోన్ ఆకారపు పువ్వులను కలిగి ఉన్న గంజాయి జాతికి సంబంధించిన మొక్కలు. హాప్ రెమ్మలు వాటి ప్రత్యేక లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. వీటిలో యాంటీ బాక్టీరియల్, చికిత్సా లక్షణాలు ఉన్నాయి. హాప్ రెమ్మల పండు, పువ్వు, కాండం బీర్, యాంటీ బయాటిక్స్ వంటి పానీయల తయారీకి, ఇతర ఔషధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు.

ఆహారంలో భాగంగా హాప్ షూట్స్ తీసుకుంటే అది శరీరంలో క్షయతో పోరాడే యంటీబాడీస్ ఏర్పడేందుకు సహాయం చేస్తుందట. ఇందులో ఉండే ఆమ్లాలు కేన్సర్ కణాలను బ్లాక్ చేస్తాయట. ఇందులోని హాప్ ఆమ్లాలు లుకేమియా ఆవిర్భావాన్ని నిరోధిస్తాయి. ఇది ఎముకలను ప్రభావతం చేసి పటిష్టంగా ఉంచుతాయి. అంతేకాకుండా తీవ్రమైన వత్తిడిని కూడా ఈ కూరగాయ దూరం చేస్తుందట.

ఆయా దేశాల్లో ఈ కూరగాయని వినియోగించడం సర్వసాధారణమట. అక్కడ పౌరుల తలసరి ఆదాయం ఎక్కువ కావడంతో ఈ కూరగాయను కనీసం వారానికి ఒక్కసారైనా ప్రతీ ఒక్కరూ వండుకుతింటారట.

భారతదేశంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం, ఈ పంట నిర్వహణ ఇతర పంటలతో పోల్చితే కష్టంగా ఉండటం, అలాగే ఈ పంటను ఎలా మార్కెట్ చేసుకోవాలనే విషయాలపై అవగాహన లేకపోవడం వంటి కారణాలతో ఈ కూరగాయ తోటలు ఇక్కడ పెరగవు. ప్రత్యేక ఆర్డరు ఇచ్చినప్పుడు మాత్రమే భారతీయ మార్కెట్‌లో కనిపిస్తుంది. గత ఏడాది కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ కూరగాయ కిలో 1000 పౌండ్లకు అంటే 1.01 లక్షల రూపాయలకు అమ్మకాలు జరిగాయి.

## పైనాపిల్ ధర రూ.లక్ష

తక్కువ ధరలో చక్కటి పోషకాలు ఎక్కువగా ఉండే పైనాపిల్‌ను సామాన్యులు సైతం కొనుగోలు చేసి తింటుంటారు.





ఒక్క పైనాపిల్ (అనాస) పండు ధర ఎంత ఉంటుంది? 40 రూపాయలు ఉంటుంది. మహా అయితే 80 రూపాయలు, ఇంకా అంటే 100 రూపాయలు ఉంటుందేమో. కానీ మనం ఇప్పుడు చెప్పుకునే పైనాపిల్ పండు ధర అక్షరాల లక్ష రూపాయలు. ఈ ధర వింటే దిమ్మ తిరిగిపోయింది కదూ.

ఇంగ్లాండ్‌లో లభ్యమయ్యే హెలిగాన్ పైనాపిల్ ధర వింటే అలాగే ఉంటుంది మరి. ఇంతకంటే ఆశ్చర్యం మరొకటి ఉంది. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా రికార్డులకు ఎక్కిందిది. ఒకసారి ఒక్క పైనాపిల్ పండును వేలం వేస్తే 10 లక్షల రూపాయల ధర కూడా పలికింది. ఈ పండ్లను కొనడానికి పోటీ పడుతుంటారు. ఈ హెలిగాన్ పైనాపిల్‌ను ఎలిజెబెత్-2 జీవించి ఉన్న రోజుల్లో ఆమెకు బహుమతిగా ఇచ్చారు.

ఇంగ్లాండ్‌లోని హెలిగాన్ గార్డెన్‌లో పండించే ఈ పండ్లకు మంచి డిమాండ్ ఉంది. ఎందుకంటే ఈ పైనాపిల్ పండు అన్ని పైనాపిల్ పండ్ల వంటివి కాదు. ఒక్కసారి పంట వేస్తే పంట చేతికొచ్చేందుకు దాదాపు రెండు నుండి మూడేళ్లు పడుతుంది. దీన్ని తొలిసారిగా 1819 సంవత్సరంలో బ్రిటన్‌కు తీసుకొచ్చారు. అక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. చెక్కతో చేసిన పెద్ద పెద్ద కుండీలు ఏర్పాటు చేసి, అందులో సేంద్రీయ ఎరువులు నింపి తగినంత ఉష్ణోగ్రత ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. అత్యంత జాగ్రత్తగా ప్రతీ రోజూ కంటికి రెప్పలా చూసుకుంటారు. ఈ పైనాపిల్‌ను సాగు చేయాలంటే కూలీలు చాలా మంది అవసరం ఉంటుంది. వారికి ప్రత్యేక శిక్షణ, జాగ్రతలు చెప్పి మరీ సాగులో కూలీలుగా నియమిస్తారు.

చంటిపిల్లల కన్నా జాగ్రత్తగా ఈ పంటను చూసుకోవాల్సి ఉంటుంది. వీటికితోడు ట్రాన్స్‌పోర్టులో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో రవాణా ఖర్చులు, పండ్ల స్టోరేజీ.. ఇలా అన్ని విషయాల్లోనూ అత్యంత జాగరూకతతో పెంచితే ఈ పండ్ల ధర పీక్స్‌లో ఉంటుంది. ఇలా అన్నింటినీ లెక్కవేస్తే ఒక్కో పండుని కనీసం యూకే కరెన్సీలో 1000 పౌండ్లకు అంటే లక్ష రూపాయలకు అమ్మితేనే పంటదారులకు గిట్టుబాటు అవుతుంది. హెలిగాన్ పైనాపిల్స్‌లో విటమిన్ 'సి' ఎక్కువగా లభిస్తుంది. ఈ హెలిగాన్ పైనాపిల్‌లో మాత్రం యాంటీ ఆక్సిడెంట్లతో పాటు, మాంగనీస్, పొటాషియం లాంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి.



## ఒక్క కిలో టీ పొడి ఖరీదు రూ.9 కోట్లు

మానవుని దినచర్యల్లో టీ నిత్యకృత్యం అయింది. రోజుకు ఒక్కసారైనా తాగనివారు ఉండరు. కొందరు రోజులో ఒకసారి తాగితే, మరికొందరు పలుమార్లు టీ తాగుతూ ఉంటారు.

ఇంట్లో టీ చేసుకుని తాగినా, బయట కూడా తాగుతారు చాలా మంది. దాని కోసం పెద్ద మొత్తమే టీ పొడి తెచ్చిపెట్టుకుంటాం. బ్రాండ్‌ను బట్టి టీ పొడి ఖరీదు ఉంటుంది. వందల్లో, వేలల్లో ధరలు కలిగి ఉన్న టీ పొడుల గురించి వింటూ చూస్తుంటాం. ఎందుకు వాటికి అంత ధర అంటే ప్రత్యేక శ్రద్ధతో సాగు చేసి ఎంతో జాగ్రత్తగా గ్రేడింగ్ చేస్తారు. కానీ ఏకంగా 9 కోట్ల రూపాయల టీ పొడి గురించి విన్నారా? కనీసం అంత ఖరీదైన టీ పొడి ఉంటుందని కలలోనైనా అనుకోగలమా!

ఒక కిలో టీ పొడి ధర అక్షరాలా 9 కోట్ల రూపాయలు ఉంటుందనేది మాత్రం నిజమే. దీని పేరు డా హాంగ్ పావో టీ. ఇదెక్కడా వినలేదే అంటారా.. ఈ టీ ఆకు అన్ని చోట్లా, అంటే అన్ని దేశాలలోనూ, పెద్ద పెద్ద పట్టణాలు, నగరాల్లోనూ లభ్యమైతే దీనికి అంత ధర ఎందుకుంటుంది. ఇది కేవలం చైనా దేశం ఫుజియాన్‌లోని వుయిసాన్ ప్రాంతంలో మాత్రమే కనిపిస్తుంది. అక్కడ మాత్రమే సాగు చేయబడుతోంది. ఇక దీనికి ఇంత ధర ఎందుకు అనే విషయంలోకి వెళితే దీని సాగు విస్తృతంగా లేదు. ఈ కారణం మాత్రమే కాకుండా ఇది ఏడాది పొడవునా లభ్యం కాదు. చాలా తక్కువ మొత్తంలో సాగవుతున్న ఈ టీ ఆకుల పరిమాణం కూడా చాలా చిన్నగానే ఉంటుంది. ఈ టీ ఆకు కేవలం 10 గ్రాముల ధర 10 నుండి 20 లక్షల రూపాయల వరకూ ఉంటుంది. పైగా దీని సాగు సాధారణ టీ ఆకుల మాదిరి కాకుండా ప్రత్యేకంగా ఉంటుంది. చైనా దేశం మొత్తం మీద కేవలం 6 ప్లాంట్‌లలో మాత్రమే సాగు చేయబడుతున్న ఈ టీ ఆకుల అమ్మకాల వల్ల చైనా మంచి లాభాలు తెచ్చుకుంటుంది.

ఇక ఈ టీ ఆకుతో తయారు చేసిన టీ తాగడం వల్ల దీర్ఘకాలంగా వేధిస్తున్న అనారోగ్య సమస్యలు తగ్గిపోతాయి.

**- సిహెచ్.వి.వి. రఘుబాబు**

కథ

# ముఖే ముఖే సరస్వతి

**రాము** పాటలు బాగా పాడతాడు. ఆ కాలేజీలో అతనికి సింగరుగా మంచి పేరుంది. ఏ కార్యక్రమం జరిగినా ప్రార్థన గీతం అతను పాడవలసిందే. విరామంలో అతను పాటలు పాడి ప్రేక్షకులను అలరించేవాడు. అతను డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. అతనే కాలేజీకి కల్చరల్ సెక్రటరీ. అందువల్ల బాగా గర్వం ఎక్కింది అతనికి.

ఆ రోజు కాలేజీ కరస్పాండెంటు పుట్టినరోజు వేడుకలు ఘనంగా కాలేజీలో నిర్వహిస్తున్నారు. ఆ సందర్భంగా పిల్లలు చిన్న చిన్న నాటికలు వేసి, జోకులు చెప్పి అలరిస్తున్నారు. కరస్పెండెంటు కరుణాకరం చాలా సంతోషిస్తున్నాడు.



ముఖ్యంగా రాము పాటని ఎంజాయ్ చేస్తున్నాడు.

ఇంతలో "నేను కూడా పాడతానంటూ" స్టేజి ఎక్కాడు చందు. అతను ఈ మధ్యనే కాలేజీలో కొత్తగా చేరాడు. ఎవరితో పరిచయాలు పెద్దగా లేవు. తన చదువేదో చదువుకుని యింటికి వెళతాడు. అతనికి మబ్బు అని నిక్‌నేమ్ పెట్టారు. దుస్తులు కూడా నాసిరకంవి వేసుకుంటాడు. అటువంటి మబ్బు పాట పాడతాననడం ఆశ్చర్యం కలిగించింది రాముకు. అందుకే చాలా చులకనగా చూశాడు.

"చూడు చందూ! ఇది ప్రతి అడ్డమైనవాడు ఎక్కి పాడే స్టేజి కాదు, దీనికొక స్థాయి ఉంది. మన సారుకు కోపం వస్తుంది అల్లాటప్పాగా పాడితే!" అని అతన్ని నిరుత్సాహపరిచాడు.

అయినా చందు బెదరకుండా "ప్లీజ్! ఒక్క ఛాన్సు ఇవ్వండి" అంటూ మొండికేశాడు.

గత్యంతరం లేక రాము అతనికి మైకు యిచ్చి పాడమన్నాడు, ఫంక్షను అయిన తరువాత అతని దుమ్ము దులుపుదామని మనసులో అనుకుని.

చందు "బ్రహ్మమొక్కటే" అంటూ గొంతెత్తి హై పిచ్‌లో పాట అందుకున్నాడు. గోల చేస్తున్న విద్యార్థులంతా ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. అతను 'తందనానా భళా తందనానా' అంటూ పాడుతుంటే ప్రేక్షకులు మైమరచి అతనితో 'తందనానా' అనడం మొదలెట్టారు. అతని పాట అయిపోగానే చప్పట్లు మారుమోగాయి. రాము ఆశ్చర్యం నుండి తేరుకునేలోగా అతను 'నానాటి బతుకు నాటకము' అంటూ యింకో అన్నమయ్య గీతం అందుకున్నాడు. ప్రేక్షకులు చెవులు అప్పగించి వింటున్నారు.

రాము అతన్ని స్టేజి మీది నుండి దిగిపొమ్మని చెప్పడం మరిచిపోయాడు.

చందు యింకా కొన్ని గీతాలు ఆలపించాడు అతి మధురంగా. కరుణాకరం స్టేజి మీదకు వచ్చి చందును కౌగిలించుకున్నాడు. తన పర్సు తీసి అయిదు వేలు బహూకరించాడు.

రాము నోరు వెళ్లబెట్టి చూస్తుండగా "ఆకారం బట్టి యోగ్యత నిర్ణయించకూడదు, ముఖే ముఖే సరస్వతి అన్నారు. చందు మోడ్రన్‌గా లేకపోయినా అతని గొంతు, అతని సంగీత జ్ఞానం అద్భుతం. ఇన్నాళ్లు రాము ఆముదపు చెట్టులాగా కాలేజీలో గొప్పగా రాణించాడు. కానీ నేడు చందు అతన్ని మించిపోయాడు" కరస్పాండెంటు చెప్పాడు.

రాము సిగ్గుపడ్డాడు తన గర్వానికి.

**- వియోగి**



# వార్త ఆదివారం

## బాలగేయం

### సంక్రాంతి

సంక్రాంతి వచ్చింది
సంబరాలు తెచ్చింది
చుక్కలన్నీ ముగ్గులై
సంక్రాంతి కాంతులై
తెలుగువారి పల్లెజీవుల
పల్లవిలా వచ్చింది
మూడు రోజుల పండుగ
ముచ్చటైన పండుగ
ఇంట్లో
కొత్త ధాన్యరాశులు
రైతన్న మోములో
నవ్వులు
భోగిమంటలు
హరిదాసుల విన్యాసాలు
ఎగిరే గాలిపటాలు
నాన్న తెచ్చిన
కొత్త బట్టలు
అమ్మ వండిన తీపి
అరిసెలు
అక్కయ్య వండిన
కమ్మని
కారప్పూస, గారెలు
ఎంతో రుచి..
బంధువుల రాకతో
ఇల్లంతా సందడి
సంక్రాంతి సంబరాల
సందడి

**- సంపంగివారి జయచంద్రారెడ్డి,** బాపట్ల

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- దండపాణి,** కోయంబత్తూరు

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. చెట్టు విలువని ఇంతని ఎలా లెక్క కట్టగలం?**

**జవాబు: దండపాణి!** యాభై సంవత్సరాలు ఎదిగిన ఒక చెట్టు రూ.5.3 లక్షల విలువైన ఆక్సిజన్‌ను అందిస్తుంది. రూ.6.4 లక్షల విలువైన భూసారాన్ని పెంచుతుంది. రూ.10.5 లక్షల విలువైన కాలుష్య నివారణ చేస్తుంది. రూ.5.3 లక్షల విలువైన నివాసాని ్న పక్షులకు, జంతువులకు కల్పిస్తుంది. వీటన్నింటికీ తోడుగా ఆహారం, పువ్వులు, ఔషధాలు, కలపను అందిస్తుంది. ఈ దృష్ట్యా ఒక చెట్టు పడిపోయిందంటే ఆ దేశానికి రూ.32 లక్షల నష్టం కలిగినట్టు. ఉదా: ఆఫ్రికాలో బయోబాయ్ అనే చెట్టు పూర్తిగా పెరిగితే దాని చుట్టుకొలత 180 అడుగులు ఉంటుంది. దీని తొర్రలో 20 మంది సునాయాసంగా నిల్చోవచ్చు.

**- శతాక్షి,** విజయవాడ

**ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. మేఘాలు ఎలా రూపొందుతాయి? వీటిలో ఎన్ని రకాలున్నాయి?**

**జవాబు: శతాక్షి!** మేఘాలకు ఒక ప్రత్యేక రూపం ఉండదు. గాలిలో ఉండే అసంఖ్యాక నీటి బిందువులు, ఐస్ క్రిస్టల్స్ కలసి ఏర్పడినవే. అంటే సూక్ష్మ బిందువుల రూపంలో గాలిలో చేరిన నీరు మనకు మేఘాల రూపంలో కనపడుతుంది. మేఘాలలో ఆర్ద్రతా శాతం సంతృప్తికర స్థాయికి చేరగానే అవి వర్షిస్తాయి. ఆ పరిస్థితులలో మేఘాలలోని సూక్ష్మ బిందువులన్నీ కలిసిపోయి నీటి బిందువులుగా మారతాయి. భూమ్యాకర్షణ శక్తి వలన అవి భూమి మీద వర్షం రూపంలో పడతాయి. మేఘాలలో ఆర్ద్రతా శాతం తగినంత స్థాయిలో వున్నప్పుడు చల్లటి గాలి వీచినా వర్షం రూపంలో నీటి బిందువులన్నీ కలిసి భూమి మీదకు జాలువారుతాయి. మేఘాలు ఏర్పడే తీరుతెన్నులను అధ్యయనం చేసి వర్గీకరణ చేసారు. మేఘాల్లో నింబస్, సిర్రస్, క్యుములస్ అనే రకాలున్నాయి.







# విశాలభావాలే ప్రగతికి మూలం

డా॥ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి,
సైకాలజిస్ట్

ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో కరీంనగర్ జిల్లాకు చెందిన 19 ఏళ్ల ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. ఆమె చిన్నతనంలోనే తండ్రి చనిపోవడంతో తల్లి గాజుల వ్యాపారం చేసి చదివిస్తోంది. ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆమె ఆదిలాబాద్‌కు చెందిన అబ్బాయిని ప్రేమించింది. పెళ్లి ప్రస్తావనను అతను తిరస్కరించడంతో మనస్థాపానికి గురై ఆమె ఆత్మహత్యకు పాల్పడింది.

కర్నూలు జిల్లాకు చెందిన ఒక వివాహితుడు ప్రియురాలితో కలసి రైలుకింద పడి మృతి చెందారు. ఆయన మరొక అమ్మాయిని ప్రేమించాడు. అయితే తల్లిదండ్రులు బలవంతంగా తన అక్క కూతురితో పెళ్లి చేశారు. 45 రోజుల తరువాత ఆయన ప్రియురాలితో కలసి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.




కృష్ణా జిల్లాకు చెందిన 22 ఏళ్ల యువకుడు పదవ తరగతి చదువుతున్న 15 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమించాడు. ఇద్దరూ బంధువులు అయినప్పటికీ పెద్దలు పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డారు.

విశాఖపట్నంలో ఒక యువతి గంజాయి, బీరు తాగి రోడ్డుపై హల్‌చల్ చేసింది. అడ్డుకున్న పోలీసులపై తిరబడింది. ఎస్.ఐ.ని బూతులు తిడుతూ, కాలితో తన్నింది. పోలీసులు అతికష్టం మీద ఆమెను కస్టడీలోకి తీసుకున్నారు.

నెల్లూరులో ఒక ఎస్సై కుమారుడు మద్యంమత్తులో కారు తోలి వీరంగం సృష్టించాడు. రోడ్డుపై అతివేగంగా కారు నడుపుతూ పలువురిని ఢీకొట్టాడు. అడ్డుకున్నవారితో తన తండ్రి పోలీసని, అందరి కథ తేలుస్తానని బెదిరించాడు. ఆఖరికి పోలీసులు కారును అడ్డుకుని అందులో ఉన్నవారిని అదుపులోకి తీసుకున్నారు.

## దారి తప్పుతున్న యువత

యువత దేశానికి వెన్నెముక అంటారు. స్వామి వివేకానందుడు యువతను గురించి తన ప్రసంగాలలో అద్భుతంగా చెప్పారు.

"ఆధునిక యువత పైనే నాకు విశ్వాసం ఉంది. నేను నిర్మించిన ఆదర్శాన్ని దేశమంతా వ్యాప్తి చేయగల సమర్థులు వారే. అలాంటి యువతముందు బలిష్టంగానూ, రుజువర్తనులుగానూ మారాలి. ఇనుపకండరాలు, ఉక్కునరాలు, వజ్రసంకల్పం ఉన్న యువత ఈ దేశానికి కావాలి. ఇలాంటి యువత వంద మంది ఉన్నా చాలు, ఈ ప్రపంచాన్నే మార్చేయవచ్చు" అంటూ స్వామి వివేకానందుడు యువశక్తిని కొనియాడారు. అయితే ఇప్పటి యువతీ యువకుల్లో కొద్ది శాతం మంది దారి తప్పి ప్రవర్తిస్తున్నారు. బలహీనతలకు బానిసలవుతున్నారు. అసాంఘిక శక్తులుగా మారుతున్నారు. వ్యసనాల ఊబిలో దిగుతున్నారు. సామాజిక మాధ్యమాలలో సైకోలుగా మారుతున్నారు. అపరిపక్వ ప్రేమలకు బలవుతున్నారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. అతి చిన్న సమస్యలకే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మితిమీరిన సెల్‌ఫోన్ దుర్వినియోగానికి అలవాటు పడ్డారు. విపరీత ధోరణి ప్రదర్శిస్తున్నారు. సామాజిక విలువలకు తిలోదకాలు ఇస్తున్నారు.

సభ్య సమాజంలో మృగాలుగా ప్రవర్తిస్తున్నారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో యువకులను పలు సమస్యలు వెంటాడేవి. చదువుకునే అవకాశాలు, సౌకర్యాలు అందరికి అందుబాటులో ఉండేవి కాదు. కష్టపడి చదువుకున్న అతి కొద్ది మందికి కూడా సరైన ఉద్యోగాలు దొరికేవి కాదు. ఆడపిల్లలకు చదువు, ఉద్యోగం అందని ద్రాక్షపండులా ఉండేది. ఆకలి, నిరుద్యోగం, నిరక్షరాస్యత, ఉపాధిలేమి యువశక్తికి అవరోధాలుగా ఉండేవి. ఇప్పుడు సమాజంలో చాలా మార్పులు వచ్చాయి. ఆధునిక సాంకేతికత అందరికీ అందుబాటులోకి

వచ్చింది. అధునాతన సౌకర్యాలు అనుభవిస్తున్నారు. ఉన్నత విద్యావం తులుగా మారి విదేశీ ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రపంచమే చిన్న కుటీరంగా మారిపోయింది. మంచి జ్ఞానం, నైపుణ్యాలు, సంకల్పం, లక్ష్యశుద్ధి ఉన్నవారు ఎంచుకున్న రంగాలలో రాణిస్తున్నారు. అయితే ఇదే సమయంలో కొందరు యువతీ యువకులు కన్న తల్లిదండ్రులు, సమాజానికి సమస్యగా మారుతున్నారు. విలువలు మరచి విపరీత ధోరణి ప్రదర్శిస్తున్నారు.

చిన్న వయసులోనే ప్రేమలంటూ తిరుగుతున్నారు. పెద్దలు కాదంటే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మాదకద్రవ్యాలు, మందుకు బానిసలవు తున్నారు. రోజురోజుకు వీరి సంఖ్య పెరిగిపోతున్నది. రెండేళ్ల క్రితం దేశంలోని 272 జిల్లాలలో మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం, వినియోగం అధికంగా ఉండేది. ఇప్పుడు ఆ సమస్య 472 జిల్లాలకు ఎగబాకింది. హెరాయిన్ వంటి మత్తుమందులు విదేశాల నుంచి కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయి. దేశీయంగా గంజాయి సాగు అడ్డూ, అదుపూ లేకుండా పోతున్నది. పాఠశాలలు, కళాశాలల్లోకి మాదకద్రవ్యాల మాఫియా చొచ్చుకుపోతు న్నది. విద్యార్థులను మత్తు రొంపిలోకి దింపి వినియోగదారులుగా, సరఫరాదారు లుగా మార్చేస్తున్నారు.

దేశంలో మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్న వారిలో 13 శాతం ఇరవై ఏళ్లలోపు వారేనని ఐక్యరాజ్యసమితి తాజా అధ్యయ నంలో వెల్లడైంది. గత ఎనిమిదేళ్లలో మన దేశంలో డ్రగ్స్ వినియోగంలో 70 శాతం వృద్ధి నమోదయ్యిందని అంటున్నారు. అంటే రోజు రోజుకు యువత ప్రమాదం అంచుకు చేరుతున్నదని చెప్పక తప్పదు.

డ్రగ్స్‌కు అలవాటు పడిన యువత పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న సంఘటనలు తరచు వార్తలకెక్కుతున్నాయి. ఇంకా అనేక సమస్యలు యువతను వెంటాడుతు న్నాయి. అలాగే వారు సామాజిక సమస్యలకు మూలంగా మారుతు న్నారు.

**వికటిస్తున్న ప్రేమలు**

మానవ వృద్ధికి మూలమైన ప్రేమ కొందరి విషయంలో వికటిస్తున్నది. ప్రేమకు.. వ్యామోహానికి తేడా తెలియని కొందరు యువతీ యువకులు, మైనర్లు అనేక సమస్యలకు గురవుతున్నారు. తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుని కన్నవారికి శోకం మిగిలిస్తున్నారు. ఆధునిక ప్రేమల్లో అధిక శాతం వ్యామోహపూరితమైనవిగానే కనిపిస్తున్నాయి. ఇలాంటి ప్రేమికులలో చాలామంది ఉద్వేగ లోపాలు కలిగివుంటా రని మానసిక నిపుణులు భావిస్తున్నారు. హార్మోన్ల ప్రభావం వల్ల కలిగే కోర్కెలకు కొందరు ప్రేమ ముసుగు వేస్తుంటారని చెప్పక తప్పదు. అర్థంలేని అసంబద్ధమైన, అపరిపక్వ ప్రేమలు అధికమవుతున్నాయని పలు సర్వేలలో వెల్లడవుతున్నది. కొంత మందిలో మానసిక సమస్యలు ఉంటాయని సైకాలజిస్టులు చెపుతున్నారు. అంటే శృంగార పరమైన ఉన్మత్త లక్షణాలు, తీవ్రమైన ఒత్తిడి, డిప్రెషన్, మొండితనం తదితర లక్షణాలు ఉంటాయని అంటున్నారు. ఇలాంటివారు తమ ప్రేమ విఫలమైనా, పెద్దలు అంగీకరించకపోయినా తీవ్రంగా స్పందించి, డిప్రెషన్‌కు గురై ఆత్మహత్యలకు పాల్పడుతుంటారని విశ్లేషి స్తున్నారు. డాక్టరు లేదా ఇంజినీరు అయినా అమ్మాయి తన ఇంట్లో పనివాడి తో లేక ఇంటర్ ఫెయిలై గాలికి తిరుగు తున్న వ్యక్తినో ప్రేమించానంటే ఎవరూ సమ్మతించరు. ఒక మైనర్ బాలిక తనకంటే 15, 20 ఏళ్ల పెద్దవాడిని లేదా పెళ్లయి పిల్లలున్న వ్యక్తిని ప్రేమించానంటే ఎవరూ గుర్తించరు. అలాగే మన సమాజంలో అనేక విశ్వాసాలు, నమ్మకాలు, ఆలోచనలు ఉన్నాయి. వాటికి విరుద్ధంగా పిల్లలు ప్రేమించామంటే తల్లిదండ్రులు సమ్మతిం చరు. బాగా చదువుకుని జీవితంలో స్థిరపడిన వ్యక్తులు తమకు తగిన వ్యక్తిని ఎంచుకుని ప్రేమిస్తే తల్లిదండ్రులలో అధిక శాతం అడ్డు చెప్పరు. చదువుకొమ్మని పాఠశాలలు, కళాశాలలకు పంపితే తమ లక్ష్యాన్ని మరచి ప్రేమ పేరుతో తిరగడాన్ని భారతీయ సమాజం సమ్మతించదు. వివాహేతర సంబంధాల లాగే ఇలాంటి ప్రేమలను తప్పుగానే భావిస్తారు. మేజర్ల ప్రేమను, సహజీవనాన్ని చట్టాలు సమ్మతించినంత మాత్రాన సమాజం హర్షించదు. అసలు పిల్లలు చదువును అశ్రద్ధ చేసి ప్రేమ అంటూ తిరగవలసిన అవసరం ఏమిటని పెద్దలు





ప్రశ్నిస్తున్నారు. వయసుతో పాటు శరీర ధర్మాలు మారడం సహజమే అనడంలో సందేహం లేదు. హార్మోన్ల ప్రభావం వల్ల లైంగిక కోర్కెలు కలగడం సహజమే. అయితే మన సమాజం, కుటుంబ నేపథ్యం, పరిస్థితులు, ధర్మాలు, సాంప్ర దాయాలు ఇతర అంశాలను గుర్తించి యువత నియంత్రణ పాటించాలి. ఒకవేళ తమ ప్రేమ నిజమైనదేతే పెద్దలను ఒప్పించాలి. లేదా ధైర్యంగా పెళ్లాడి తమ కాళ్ల మీద తాము నిలబడి చూపించాలి. అంటే తమకు వ్యక్తిత్వం ఉందని, శక్తి సామర్థ్యాల ఆధారంగా బతకగలమని నిరూపించాలి. అంతేతప్ప పెద్దలు సమ్మతించలేదని ఆత్మహత్యకు పాల్పడటం లోపంగానే గుర్తించాలి. కొంతమంది ప్రేమంటూ కొన్నాళ్లు తిరిగి పెళ్లి అనగానే తప్పించుకుంటుంటారు. అలాంటి దశలో తట్టుకుని తమ లక్ష్యాన్ని సాధించి మంచి జీవితాన్ని స్వంతం చేసుకుని సత్తా చాటుకోవాలి. అంతేతప్ప ప్రేమికుడు లేదా ప్రియురాలు మోసం చేసిందని ఆత్మహత్య చేసుకోవడం మానసిక దుర్బలతగానే చూడాలి. పిల్లలు, విద్యార్థులు, యువత ఇలాంటి విఫల ప్రేమల్లో పడటాన్ని లోపంగానే భావించాలి. అంటే సామాజిక స్పృహ లేకుండా, ఉద్వేగ నియంత్రణ కోల్పోయి ప్రేమలో పడ్డారని భావించక తప్పదు. ఒకవేళ పొరపాటుగా తప్పటడుగు వేసినా వివేకంతో సరిదిద్దుకోవాలి తప్ప ఒత్తిడికి లోనై ప్రాణాలు తీసుకోవడం మంచిది కాదు. ఆత్మహత్య దేనికీ పరిష్కారం కాదని గుర్తించి తమ సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి. విద్యార్థులు, యువతీ యువకులు సమాజాన్ని దర్శించాలి.

(మిగతా 24వ పేజీలో)

కథ

# 'పాత' రేసిన పండుగ

అల్లాడి శ్రీనివాస్

**వారసత్వంగా అందిన వ్యాపారం.. మూడు ట్రక్కులూ, ఆరు గోదాములుగా వెలిగిపోతోంది.**

**ఎంతో మంది జ్ఞాపకాలకు అక్కడ సమాధులున్నాయి.**

**ఉస్మాన్ భాయ్‌కి మార్కెట్‌లో మంచి పేరుంది. నిజాయితీగా వ్యాపారం చేస్తాడని అందరి నమ్మకం.**

**ఆయన దుకాణం దగ్గర జరుగుతున్న సన్నివేశంలోకి ఓసారి తొంగిచూస్తే-**

ఒక పెద్ద డబ్బా టీవీ పక్కకు విసిరివేయబడ్డది. ఆ టీవీలోని పని చేయని పిక్చర్ ట్యూబ్ భళ్లున పగిలిపోయింది.

గుండె పగిలినంత బాధతో ఆ టీవీ పక్కకు చూసింది. అక్కడ అద్దం పగిలిపోయి ముళ్ల ఊడిపోయిన అలారం గడియారం పడి వుంది. నాలుగు రోజులుగా అక్కడే పడి వున్న ఆ అలారం గడియారం టీవీని అడిగింది..

"ఏందమ్మా.. బాధపడుతున్నావు?" ఓదార్పు మిళితమైన స్వరంతో.

"ఏం చెప్పమంటావు నా బాధ.. పదిహేనేళ్లు నేను వాళ్లకు రంగుల ప్రపంచాన్ని చూపించాను. మాటలు, పాటలు, ఆటలు, సినిమాలు, సీరియళ్లూ.. ఇలా ఎన్నెన్నో వాళ్ల కళ్ల ముందు కుమ్మరించాను. కృతజ్ఞతా భావం కూడా లేకుండా నన్ను చెత్తసామానుగా జమకట్టి ఇక్కడ పడేసారు. వాళ్లు చేసినదానికి ఏడవకుండా నవ్వమంటావా?" ఎదురు ప్రశ్న వేసింది టీవీ.

"నీకేమన్నా చేతకాని పక్షంలో ఏ డాక్టరుకన్నా చూపించకుండా ఇలా పారేసే పరిస్థితి ఎలా వచ్చిందమ్మా" మళ్లీ ఓదార్పు.. డోలు మద్దెలకు చెప్పినట్టు-

"ఇప్పుడు వాళ్లింటికి నాలాగా చూపించే ఇంకో వన్నెలాడిని తెచ్చుకున్నారు. దాన్ని గోడకు బిగించి కార్యక్రమాలన్నీ చూస్తున్నారు. అది కొత్త రంగు పొంగులతో రెచ్చిపోతోంది. నేనేమో ముసలిదాన్ని. ఎలా దానితో పోటీపడగలను. కండ్లు మసకబారిపోయాయి. గొంతు మూగబోయింది.

"దీన్ని ఉంచుకుంటే జాగా వేస్ట్ అవుతుంది, రిపేర్ చేయిస్తే డబ్బులు దండగ' అని వాళ్ల నిష్టూరాలు పలుకగా విన్న నాకు మెదడు మొద్దుబారింది. ఇప్పుడు చెప్పు.. నేను బాధపడడం తప్పా?" ఇంకో ప్రశ్నతోనే సమాధానం చెప్పింది టీవీ.

"తప్పదమ్మా.. నా పరిస్థితి కూడా అలాంటిదే. ఇన్ని రోజులు వాళ్ల బెడ్రూంలో మంచం పక్కనే నాకు సింహాసనమేసారు. నన్ను భద్రంగా పెట్టుకున్నారు. వాళ్లను ఎప్పుడు కావాలంటే లేపేది నేను. ఇప్పుడేమో ఇంట్లో ఉన్నోళ్లందరి చేతుల్లో ఒకదాన్ని చూసాను.

వాళ్ల శరీరంలోని అవయవంలాగే ఇరవై నాలుగ్గంటలూ దాన్ని దగ్గరే పెట్టుకుంటున్నారు. దాంట్లోనే వాళ్లు అలారం పెట్టుకుంటున్నారు... రకరకాల సంగీతంతో. నన్ను ఎలా ఉంచుకుంటారు. ఇలా పారేశారు" ఒకింత దీనంగా చెప్పింది అలారం గడియారం.

'ఓ అలారమ్మా.. దానితోటే ఈ గొడవంతా. దాంట్లో ఒక్క అలారం కాదు. నేను చూపించిన విధంగా బొమ్మలన్నీ చూపిస్తుంది. నీ వల్లే టైం కూడా చూపిస్తుంది. టైమే కాదు, తారీఖు, వారం.. అన్నీ దాంట్లోనే చూస్తున్నారు" అంటూ చెప్పుకుంటూ పోతున్న టీవీకి అక్కడే సిమెంట్ పిల్లర్‌కు వేలాడుతున్న యాషికా కెమెరా అడ్డుపడింది.

"అప్పట్నుండి మీ సంభాషణ వింటున్నాను. అవునక్కా.. మీరు చెప్పింది నిజమే. దాని పేరు సెల్‌ఫోనట. నేను ఈ పిల్లర్‌కు ఉరి వేసుకునే దుస్థితి తీసుకొచ్చింది కూడా ఆ సెల్‌ఫోనే" అన్నది కెమెరా.

"నిన్ను ఈ చెత్తలో పడేయడానికి కారణం కూడా ఆ సెల్‌ఫోనేనా.. అదెట్లా?" అని అడిగింది టీవీ.


"అక్కా.. నేను ఫోటోలు తీయాలంటే ఓ రీలు కొని నా కడుపులో పెట్టేవాళ్లు. ఇప్పుడా సెల్‌ఫోను ఏ రీలు లేకుండానే ఎన్నంటే అన్ని, ఎలా అంటే అలా, ఎక్కడంటే అక్కడ ఫొటోలు తీస్తోంది. ఎవరి ఫొటో వాళ్లు తీసుకునేలా సెల్ఫీలు కూడా.." అని చెప్తున్న కెమెరా-

"ఓయ్.." అన్న కేక వినబడ్డ వైపు చూసింది.

ఐదడుగుల దూరంలో వేల పెండ్లిళ్లను చిత్రీకరించిన వీడియో కెమెరా అరిచిన అరుపు అది.

"తమ్మీ.. ఒక్క ఫొటోలు కాదు.

నా సెల్‌ఫోను వీడియోలు కూడా తియ్యవట్టింది. నేనెవల్లకు జెప్పాలే?!" అని తల బాదుకుంది వీడియో కెమెరా.



ఓ పక్కన దుమ్ము పట్టిన వీసీఆర్ మీద దిగులుగా కూసున్న వీడియో క్యాసెట్ మొదలుపెట్టింది.

"నన్ను నీ లోపల వేసి చిత్రీకరించి దృశ్యాలను చూడడానికి, నన్ను ఈ వీసీ ఆర్‌లో వేసి ఆ టీవీలో చూసేవాళ్లు. ఇప్పుడు మనందరి పని ఆ సెల్‌ఫోన్ ఒక్కతే చేస్తోంది. ఫొటోలు, వీడియోలు దానితోనే తీస్తున్నారు.

అలా తీసిన వాటిని దానిలోనే చూస్తున్నారు. ఆ ఒక్కతి వచ్చి మనందరినీ అజ్ఞాతవాసంలోకి నెట్టింది".

అది విన్న టేప్ రికార్డర్ "ఆగుండ్రీ.. గది మిమ్ములనే గాదు, నన్నూ, నా కడుపులున్న క్యాసెట్‌నూ ఎటుగాకుంట జేసింది. వీడియోలేగాదు, ఆడియోలు, రికార్డింగ్‌లు అన్నీ గా సెల్‌ఫోన్లనే కాలిపాయె. మనందర్నీ బర్బాద్ చేసిన దాని సొంపు ఎన్ని రోజులుంటదో సూడాలే" అన్నది.

ఈ ముచ్చటంతా వింటున్న ల్యాండ్‌ఫోను మదిలో ల్యాండ్‌మైన్ పేలినంత బాధ.

"ఒకప్పుడు ఇండ్లల్లో నన్ను పెట్టుకొని, నా తల్కాయకున్న పొక్కలల్ల ఏలు వెట్టి గిర్ర గిర్ర తిప్పి ఎక్కడెక్కనో వున్నోల్లతోటి మాట్లాడేటోల్లు. ఇప్పుడు గీ సెల్‌ఫోను ఎటు వోయినా గాల్ల సేతుల్నే. యాడంటే గాడ మాట్లాడవట్టిరి. మాట్లాడుడొక్కటే కాదు.. అటు పక్కునున్నోల్లు సుతం కన్పియ్యవట్టిరి. వీడియో కాలట... మన్నట.. మషానమట.." అని ల్యాండుఫోను లోలోపల అనుకుంటూ బాధపడింది.

అప్పుడే... ఆ దుకాణంలో పని చేసే అబ్బాయి న్యూస్ పేపరు కట్టలో నుండి బయటపడ్డ ఉత్తరాలను వీళ్ల మధ్యలోకి విసిరేసాడు.

"మిమ్మల్ని ఇలా విసిరేసారేంటి? ఏంటీ మీ కథ.. వ్యథ" అడిగింది టీవి ఆతృతగా.

"మీరు ఇప్పటివరకు మాట్లాడిన ఆ సెల్‌ఫోన్‌లోనే టార్చిలైటు కూడా వుంది. నన్ను ఎవరు కొంటారు? నా లోపట్ల సెల్లులు ఎవరు వేస్తరు. ఇగ నా గతి ఇంతే" వైరాగ్యంలోకి జారిపోయింది టార్చిలైటు.

ఆ గుంపులో నుండి ఓ ఇన్‌లాండ్ లెటర్ స్పందించింది.

"ఒకప్పుడు మేమూ, మా తమ్ముళ్లు, ఈ పోస్టు కార్డులు ఉత్తరాల మందరం ఓ వెలుగు వెలిగాం. పోస్టు మ్యాన్ జబ్బసంచి నిండిపోయేది. ప్రేమలేఖలైనా, అఫీషియల్ లెటర్స్ అయినా బంధు, మిత్రులు, శ్రేయోభిలాషులకు సమాచారం చేరవేయాలంటే మాలో ఎవరో ఒకరం దిక్కు. ఇప్పుడు ఆ సెల్‌ఫోన్ వచ్చింది. దాంట్లో ఇంటర్నెట్‌తో వాట్సప్‌లు, ఫేస్‌బుక్‌లూ అని.. ఇక్కడ రాయగానే అక్కడ చూసే వీలుంది. అప్పట్నుంచి మాకు గిరాకీ తగ్గింది" అని మిగతా ఉత్తరాలను హత్తుకొని ఆక్రోషించింది.

అంతలో ఆ దుకాణపు అబ్బాయి ఒక చెక్ బుక్‌ను విసిరేసాడు.

అది అసలే వాడని.. ఒక్క లీఫ్ కూడా చినగని పాత చెక్ బుక్.

దాన్ని చూసి పోస్టు కార్డు "నీకేం గతి పట్టిందయ్యా.. నీ మీద ఎంత రాసి సంతకం పెడితే నీకు అంత విలువ ఉంటుండేది కదా. ఏమైంది మీకు..?" అనడిగింది.

"ఇప్పుడు మా మీద రాసి ఇస్తే తీసుకొని బ్యాంకుకెళ్లి డబ్బులు తీసుకునే ఓపిక ఎక్కడుంది ఈ జనాలకు? ఆ సెల్‌ఫోనులోనే గూగుల్ పే, ఫోన్ పే.. ఇలా.. ఇంకా ఏవేవో పేలని వుంటాయి.

ఇక్కడ బటన్ నొక్కితే అక్కడ వాళ్ల ఖాతాలో డబ్బులు పడతాయి. ఇక మాతో పనేం ఉంటుంది ఈ జనాలకు" అని ఆవేదన వ్యక్తం చేసిందా చెక్ బుక్.

అప్పుడే సెల్లులు కాలిపోయిన ఓ పొడుగాటి టార్చిలైటు పొర్లుకుంటూ వాళ్ల మధ్యలోకి వచ్చి ఆగింది.

"ఏమైందిరా సోకిల్లరాయుడా.. ఒకప్పుడు మస్తు లైటింగు కొట్టేవాడివి కదా... ఇలా డీలా పడ్డావేందిరా?" అడిగింది టీవి.

"మీరు ఇప్పటివరకు మాట్లాడిన ఆ సెల్‌ఫోన్‌లోనే టార్చిలైటు కూడా వుంది. నన్ను ఎవరు కొంటారు? నా లోపట్ల సెల్లులు ఎవరు వేస్తరు. ఇగ నా గతి ఇంతే" వైరాగ్యంలోకి జారిపోయింది టార్చిలైటు.

అప్పుడే అక్కడికి విసిరివేయబడ్డ లక్షలు, కోట్ల లెక్కలు చేసిన క్యాలికులేటర్ బాధ కూడా అదే.

ఆ సెల్‌ఫోనులోనే క్యాలుకులేటర్ కూడా వుంది. ఎంత పెద్ద లెక్కయినా అందులోనే చెయ్యవచ్చు. ఆ సెల్‌ఫోన్‌లో 'నెట్' వుంటే చాలు.. చేతుల్లో ప్రపంచం ఉన్నట్టు లెక్క. అక్కడి సామాన్లన్నీ దాని వల్లనే ఆ స్థితిలోకి వచ్చాయి.

.........

ఉస్మాన్ భాయ్ తండ్రి అబ్బాస్ అలీ ఎనభై ఏళ్లకు పైబడిన వయస్సులో మొన్నీమధ్యనే హార్ట్ ఎటాక్‌తో మరణించాడు.

అబ్బాస్ అలీ నాటి, పెంచి పోషించిన మొక్కనే ఇప్పుడు ఉస్మాన్‌భాయ్‌కి నీడనిస్తున్న వృక్షమైన ఈ పాత సామాన్ల వ్యాపారం.

ఓ యాభై మందికి పైగా వివిధ గ్రామాల నుండి సేకరించి తెచ్చిన పాత సామాన్లను కొని- రీసైక్లింగ్‌కి హైదరాబాద్, ముంబై, బెంగళూరు లాంటి నగరాలకు పంపుతాడు.

తల్లి జుబేదాకు వయసురీత్యా వచ్చిన ఆరోగ్య సమస్యలతో చేతగాకుండా, బాగా నీరసించిపోయింది.


## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080. sunmagvaartha@gmail.com

ఉస్మాన్ భాయ్ భార్య రేష్మా అత్తకు సేవలు చేయడానికి విముఖతతో చికాకు పడడం మొదలెట్టింది.

ఉస్మాన్ భాయ్‌కి భార్య పోరు తలనొప్పిగా మారింది.

"నాకేం తోచడం లేదు. పరిష్కార మార్గం నువ్వే ఆలోచించి చెప్పు" అని తన భార్యకే నిర్ణయాధికారం ఇచ్చాడు.

.........

ఉస్మాన్ భాయ్ కౌంటర్ మీద అలా కూర్చున్నాడో లేదో... ఒకతను ఒక పెద్ద రేడియో.. ఒకప్పటి మర్ఫీ కంపెనీది తీసుకొచ్చాడు.

"ఉస్మాన్‌భాయ్! దీనికి ఎంతిస్తవు?" అని అడిగాడు.

"ఇరవై రూపాయలిస్తా, అక్కడ పెట్టిపో" అన్నాడు ఉస్మాన్‌భాయ్.

"ఇరవై కాదుగానీ, యాభై ఇవ్వు. ఇప్పటికీ సెల్లులేస్తే నడుస్తది" అన్నాడు రేడియో తెచ్చినతను.

"అది నడిస్తే నేనేమన్నా దాంట్ల పాటలు పెట్టుకొని వింటనా.. సరే.. నలభై ఇస్త, తీసుకో" అని డబ్బులిచ్చి అతన్ని పంపించేశాడు ఉస్మాన్‌భాయ్.

అప్పుడే జేబులో వున్న సెల్‌ఫోను మోగింది.

ఫోన్ తీసి చూస్తే రేష్మా నుండి ఆ కాల్.

"ఇప్పుడే కదా ఇంటి నుండి వచ్చింది.. రేష్మా ఎందుకు చేసిందబ్బా?" అనుకుంటూనే కాల్ లిఫ్ట్ చేశాడు.

"హాజీ.. ఇప్పుడే మా దీదీ ఫోన్ చేస్తే అడిగిన.. ఇక్కడనే తీగలగుట్టపల్లిలో ఓ ఓల్డ్ ఏజ్ హోం వుందట. మీ అమ్మను అక్కడ చేర్పిద్దాం జీ.. అల్లా దయతోని మనకేం తక్కువ లేదు. ఆప్ కీ ఫైసలా కే లియే ఇంతెజార్" అని కాల్ కట్ చేసింది రేష్మా.

ఉస్మాన్‌భాయ్ ఆలోచనలో పడ్డాడు. నెలకు పదివేలు కట్టడం తనకేం కష్టంకాదు. సరే.. రేష్మా తృప్తికోసమైనా నిర్ణయం తీసుకోక తప్పలేదు.

రేష్మాకు కాల్ చేసి "ఒకసారి నేను ఆ వృద్ధాశ్రమానికి వెళ్లి వివరాలు తెలుసుకొని అడ్వాన్సు ఇచ్చి వస్తాను" అని చెప్పాడు ఉస్మాన్‌భాయ్.




దుకాణం నుండి నేరుగా 'ఆత్మీయ సదనం' అని పేరున్న వృద్ధాశ్రమానికి వెళ్లాడు.

వివరాలన్నీ అడిగి బాపతు పది వేల రూపాయలు అడ్వాన్సుగా చెల్లించి "రేపు పొద్దున్న అమ్మను తీసుకొస్తా" అని చెప్పి ఇంటికి వెళ్లాడు ఉస్మాన్‌భాయ్.

మాయమాటలు చెప్పి.. ఎలాగోలా ఒప్పించి అమ్మను కార్లో తీసుకెళ్లి ఓల్డ్ ఏజ్ హోంలో దిగబెట్టి వచ్చాడు ఉస్మాన్ భాయ్.

రేష్మా కళ్లల్లో అంతులేని ఆనందపు మెరుపు.

రెండు రోజులు గడిచిన తర్వాత..

మొన్న రేడియో అమ్మిన అతను ఆయాసం, ఆందోళనలతో ఉస్మాన్ భాయ్ దుకాణంలోకి అడుగు పెట్టాడు

"ఏంటయ్యా టెన్షన్ పడుతున్నావ్? మళ్లా ఏం తెచ్చావ్?" అని అడిగాడు ఉస్మాన్ భాయ్.

"ఉస్మాన్‌భాయ్! మొన్న నేనిచ్చిన రేడియో ఉన్నదా? స్క్రాప్‌లో బయటకు పోయిందా?" అడిగాడు, అంతే ఆందోళనతో.

"అదిగో తమ్మీ.. శుభ్రంగా తుడిపించి అక్కడ పెట్టించాను" అని ఎదురుగా ఓ స్టూల్ మీదున్న ఉన్న రేడియోను చూపాడు ఉస్మాన్‌భాయ్.

"ఉస్మాన్‌భాయ్! నువ్విచ్చిన నలభైకి బదులు ఎనభై ఇస్త. ప్లీజ్! నా రేడియో నాకు ఇచ్చేయవా?" ప్రాధేయపడ్డాడతను.

"నాకు డబుల్ పైసలు ఇచ్చుడు ఏం అవసరం లేదు. నా పైసలు నాకిచ్చి నీ రేడియో తీసుకపో తమ్మీ" అన్నాడు ఉస్మాన్‌భాయ్.

"మా నాన్నకు ఈ రేడియో అంటే ప్రాణం. ఎప్పుడూ తను ఆరాం కుర్చీలో కూర్చొని ఈ రేడియోలో ఏదో ఒకటి.. పాటనో, నాటికనో, వార్తలో, క్రికెట్ కామెంట్రీనో వినేవాడు. ఈ రేడియోను మా హాల్లో అలంకరణగా పెట్టుకొని, దానిలో మా నాన్నను చూసుకుంటాను భాయ్.

ఆ రేడియోను ఇక్కడ ఇచ్చినప్పటి నుండి ఏవేవో పీడకలలు. దయచేసి మా నాన్నను నాకిచ్చేయవా? సారీ! మా రేడియోను.. భాయ్" అంటూ కళ్లల్లో నీళ్ల నింపుకున్నాడతను.

ఉస్మాన్‌భాయ్ హృదయం ద్రవించింది. అతనిచ్చిన నలభై రూపాయలు కూడా తనకు వద్దని చెప్పి అతని రేడియో అతనికిచ్చేసాడు.

ఉస్మాన్‌భాయ్ మెదడు పొరల్లో ఆలోచనా పరంపర.. అస్తవ్యస్తంగా...

"ఒక వ్యక్తి వస్తువుతోనే ఇంత అనుబంధం పెంచుకుంటే నేనేంటీ! కన్నతల్లిని అక్కడ వదిలిపెట్టి వచ్చాను" అని మదనపడుతూ ఓ స్థిర నిర్ణయం తీసుకున్నాడు...

మనసు తేలికైంది.


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

sunmagvaartha@gmail.com

# తెలుగు పత్రికా రంగానికి నారూ, నీరూ పోసిన 'వి.ఆర్.నార్ల'

**తెలుగులో పత్రికా రచనను దివి నుండి భువి పైకి దింపి సామాన్య జనజీవన పరం చేసిన నార్ల వెంకటేశ్వరరావు(వి.ఆర్.నార్ల) పత్రికా రంగంలో నవ శకానికి నాంది పలికారు. అంతకుముందు నార్లకు ముందు యుగంలో పత్రికలు వున్నా, తదుపరి 85 సంవత్సరాలు, నార్ల యుగంగా సంపాదకునిగా నార్ల తెలుగు ప్రజకు ప్రసాదించారు.**

తెలుగు పత్రికా రంగం కాశీనాథ, ముట్నూరి, తాపీ, ఎస్.జి. ఆచార్య వంటి ఎందరో త్యాగశీలుర సారథ్యంలో చరిత్ర కలిగివున్నా, దేశ స్వాతంత్ర్యం రావటానికి ముందు దశాబ్దంలో 1935 సంవత్సర ప్రాంతంలో నార్ల యువ రచయితగా పత్రికా రంగాన్ని మలుపు తిప్పారు. కొత్త పదాల కల్పన, నూతన శైలి, రచనా విధానంలో కొత్త ఒరవడి పత్రికా పలుకుబడి, వ్యవహారిక భాషగా రూపు దిద్దుకొంటున్న 'గిడుగు' వారి భాషోద్యమానికి పత్రిక జీవం అందించింది. తెలుగు నుడికారం పుట్టిపడే తేటతెలుగులో, మాండలిక పదజాలం ప్రవేశించి పత్రికా భాషగా తెలుగు సుసంపన్నం కావడానికి 'నార్ల' ఆద్యులయ్యారు. వ్యాపార ప్రకటనల ప్రాధాన్యత కోసం పుట్టిన దిన, వార, మాస పత్రికలు క్రమేపీ వ్యాసాలు, వ్యాఖ్యానాలు, వార్తాంశాలు, సంపాదకీయాలు వివిధ సాహితీ ప్రక్రియలతో జన సామాన్యపు కరదీపికలుగా నార్లవారి సత్కృషి జనరంజకమైంది.




1908 డిసెంబరు 1న జన్మించిన నార్ల, 1935లో మద్రాస్ జర్నలింజలో అడుగు పెట్టారు. జస్టిస్, స్వరాజ్య, జనవాణి, ప్రజామిత్ర, ఆంధ్రప్రభకు ప్రధాన సంపాదకునిగా 1959 వరకు తెలుగునాట భాష, భావోద్యమ చైతన్యశీలిగా సుసంపన్నత చేకూర్చారు. 1960-1977 మధ్య ఆంధ్రజ్యోతి సంపాదకునిగా తెలుగు జర్నలిజానికి చరిత్ర సృష్టించారు. నిత్య జీవితంలో వృత్తిపరంగా ఏ పత్రికాధి పతికి తలవంచలేదు. ఎడిటర్‌గా తన వ్యక్తిత్వాన్ని కాపాడుకొన్నారు. తన జేబులో రాజీనామా పత్రం పెట్టుకుతిరిగే స్వేచ్ఛాజీవిగా పత్రికా రంగాన్ని ప్రభావితం చేసారు. నార్ల పత్రికా బాధ్యత చేపట్టక ముందు తెలుగు పత్రికలలో భాషలో చాలా వైవిధ్యం వుండేది. పత్రికలు గ్రాంథికంలో లేదా వ్యావహారికంలో నడిచేవి. ప్రత్యేకంగా పత్రికల భాష వుండేది కాదు. వార్త లేదా సంపాదకీయం రాసే వ్యక్తికి అలవాటైన భాష మాత్రమే కనిపించేది. ప్రజలకు అర్థమయ్యే పలుకుబడి వుండేది కాదు.

స్వాతంత్ర్యానంతరం నార్ల సంపాదకీయాలు, కేవలం మధ్య, ఉన్నత తరగతుల వారికే కాకుండా, నగరాలు పట్టణాలలోనే కాకుండా గ్రామాలలో రచ్చబండ దగ్గర చదివి వినిపించే సంస్కారం వికసించింది. అందుకే 'నార్ల మాట ప్రజల మాట' అయింది. 'నార్ల బాట ప్రజాస్వామ్య బాట' అయింది.

**"పత్రికొక్కటున్న పది వేల సైన్యము**
**పత్రికొక్కటున్న మిత్రకోటి**
**ప్రజలకు రక్షలేదు పత్రిక లేనిచో**
**పత్రికే నియంత పక్కలో బల్లెమ్ము**
**పత్రికే ప్రజాళి పట్టుగొమ్మ**
**ప్రభుత వక్రమౌను పత్రిక లేనిచో"** అన్నారు.

పత్రికలకున్న శక్తి ఏమిటో, 1955లో ఆంధ్ర రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికలలో ప్రచార ఉద్యమబాణీ ప్రారంభించి నార్ల రుజువు చేసారు. రాష్ట్రంలో నేటివరకు కోలుకోలేని దెబ్బ కమ్యూనిజం అనుభవించింది. పత్రికలు(ప్రస్తుతం మీడియా) ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్ది, జనసామ్యాన్ని కదిలించే మార్గ దర్శకత్వం వహించగలవని నార్ల నిరూపించారు. కృష్ణా పత్రికతో 1932లో ప్రారంభించిన పాత్రికేయ వృత్తి దాదాపు అయిదు దశాబ్దాల పాటు ఏ ఇజమ్‌కు లొంగకుండా, దేనికీ తల వంచకుండా ఆదర్శ పాత్రికే యునిగా పత్రికా ప్రపంచానికి మార్గదర్శకులయ్యారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం పత్రికలపై విధించిన ఆంక్షలను నిరసిస్తూ ప్రచురణ నిలిపివేసారు.

మహాత్మాగాంధీ హత్య సందర్భంలో నార్ల సంపాదకీయంపై, విద్వత్కవి వేటూరి ప్రభాకర శాస్త్రి 'ఈ సంపాదకీయం వెలువరించిన వారికి సాష్టాంగ నమస్కారం చేయవచ్చు' అని ప్రశంసించారు.స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో, జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తలను గతంలో లేని విధంగా సరళమైన మాటలు, సూటిగా అర్థమయ్యే పలుకుబడులు, అనువాద నైపుణ్యంతో మారుతున్న దేశ సామాజిక పరిస్థితులను, అంతర్జాతీయ పరిణామాలను తెలుగు ప్రజకు అందించే కొత్త పత్రికా రచనకు అంకురార్పణ చేసారు.

నార్ల కేవలం ఎడిటర్‌గా, పత్రికా రచయితగా, వ్యాసకర్తగానే కాకుండా తెలుగులో సాహితీవేత్తగా రచయితగా ప్రతిష్ఠత సాధించారు. స్వదేశీ సంస్థానాలు(1933) తొలి గ్రంథంగా మొత్తం వ్యాస సంకలనాలు, నాటికల సంపుటి, పద్య, గేయ రచయితగా, మూడు దశాబ్దాలు(సంపాదకీయాలు), జాబాలి(ఏకాంకిక), వీరేశలింగం జీవిత చరిత్ర, సీతజోస్యం, పంచరాత్రం, ఇరవై గ్రంథాలు వెలుగు చూసాయి. హేతువాది, మానవతావాది, సంస్కరణాభిలాషిగా, డా॥ అంబేద్కర్ మేధాపర భావజాలంతో సమాజాన్ని ప్రభావితం చేసారు. 'వాస్తవమ్ము గార్లవారి మాట' మకుటంతో ఆటవెలదులు రచించారు. 'నవ యుగాల బాట నార్ల మాట' మకుటంతో 700కు పైగా సందేశాత్మక పద్యాలు రాశారు. 16 ఏకాంకిల సంపుటి వెలువరించారు. ఏది రాసినా సామాజిక ప్రయోజనం ఉట్టిపడేది. తొలుత బ్రహ్మ సమాజ ప్రభావం నుంచి క్రమేపీ హేతువాదిగా నాస్తిక భావాలను అభిమానించి ఆచరించారు. గాంధీజీ రేషనల్ మైండ్ పెంపొందించాల్సింది పోయి, రెలిజియస్ మైండ్ అభివృద్ధి చేసాడని నిర్మొహమాటంగా తన అభిప్రాయం వ్యక్తం చేసారు. 1958-64, 1964-70లలో రాజ్యసభ సభ్యుని గా వ్యవహరిం చారు. ఆయన మేధా సంపదకు నిలయంగా పదహారు వేల గ్రంథా లకు పైగా ఇంట్లో గ్రంథాలయం వుండేది. నిరంతరం పఠనా పిపా సిగా వేదాల నుండి నాస్తికం వరకు అధ్య యనం చేసారు. 'వాస్తవమ్ము నార్లవారి మాట' యోగి వేమన పద్యాలకు తీసిపోని జీవిత సత్యాలను ప్రబోధిస్తున్నాయి. మేధావి, కవి, రచయిత, హేతువాది, మానవతావాదిగా తెలుగుభాష సాహిత్యాన్ని, ప్రధానంగా పత్రికా రచనకు నూతన శకాన్ని ఆవిష్కరింప చేసారు. 1985 ఫిబ్రవరి 16న కన్ను మూసారు.

**- జయసూర్య**

(19వ పేజీ తరువాయి)

సామాజిక స్పృహ పెంచుకోవాలి. తమను తాము వ్యక్తిగా తీర్చిదిద్దుకోవాలి. సరైన జీవిత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలి. సమాజంలో కీర్తి సాధించాలి.

### మీడియా మ్యానియా

సమాజ ప్రగతికి మీడియా సోపానం. సమాచార సాధనమైన మీడియా సమాజ సారథిగా, వారధిగా ఉంటుందనడంలో సందేహం లేదు. పురాణాలలో నారదుడు సమాచార వ్యాప్తి ద్వారానే లోక కళ్యాణం సాధించారు. మానవ సమాజంలో ఏర్పడినప్పటి నుంచి పలు రకాల ప్రచార, ప్రసార మాధ్యమాలు కీలకపాత్ర పోషిస్తూ వస్తున్నాయి. అయితే ఆధునిక సమాజంలో సామాజిక మాధ్యమాలు ప్రథమ స్థానాన్ని ఆక్రమించుకున్నాయని చెపితే అతిశయోక్తి కాదు. ఇంటర్నెట్ సేవలు విస్తృతమైన తరువాత ప్రపంచ వ్యాప్తంగా జరిగే సంఘటనలు, సమాచారం క్షణంలో ప్రపంచాన్ని చుట్టేస్తున్నది. దీనితో ప్రజలు ముఖ్యంగా యువత సామాజిక మాధ్యమాలకు అలవాటు పడ్డారు. కొందరికి ఇది వ్యసనంగా మారింది. రోజంతా సామాజిక మాధ్యమాలలో గడుపుతూ, ఇల్లు, ఒళ్లు, కళ్లు పాడు చేసుకుంటున్నారు. అతికొద్ది శాతం మందిలో సామాజిక మాధ్యమాలు ఉన్మాదానికి దారి తీస్తున్నట్టు పలు సంఘటనలు వెల్లడిస్తున్నాయి. దీనినే మీడియా మ్యానియాగా ప్రపంచ వ్యాప్తంగా చెప్పుకుంటున్నారు. సమాజంలో దాదాపు ఐదు శాతం మంది తీవ్రమైన మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారు. ఇందులో స్కిజోఫ్రినియా, బైపోలార్ డిజార్డర్, ప్యారనాయిడ్ సైకోసిస్, డిప్రెషన్, మానియా, సైకోసిస్ లాంటివి తీవ్రమైనవిగా భావిస్తారు. ఒక్కోసారి ఈ రుగ్మతలతో బాధపడుతున్నవారు ప్రమాదకరంగా వ్యవహరిస్తుంటారు.

ఇలాంటి సమస్యలు ఉన్నవారు సామాజిక మాధ్యమాలు (సోషియల్ మీడియా) చెలరేగిపోతుంటారు. అసభ్య, అశ్లీల వీడియోలు, పోస్టింగులు పెట్టడం ఇతరులపై బూతుకామెంట్లు పెట్టడం చేస్తుంటారు. సామాజిక మాధ్యమాలలో ఇలాంటి సైకోలు ఐదు నుంచి 10 శాతం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. సామాజిక మాధ్యమాలకు సెల్‌ఫోన్‌లనే ఎక్కువగా వాడుతుంటారు. ఇప్పుడు ఆధునికమైన సెల్‌ఫోన్లు రావడంతో అన్నింటినీ అందులోనే చూస్తూ, వింటూ, చెపుతూ, చదువుతూ కాలం గడుపుతున్నారు. అయితే కొంత మందికి ఇది వ్యసనంగా మారింది. ముఖ్యంగా పిల్లలు,



యువత రోజంతా సెల్‌ఫోన్లతో గడుపుతూ నష్టపోతున్నారు. కొంతమంది నీలిచిత్రాలకు అలవాటు పడి జీవితాలను పాడుచేసుకుంటున్నారు. అలాగే ఆటల పేరుతో సాగే జూదక్రీడల్లో పాల్గొని డబ్బు పోగొట్టుకుంటున్నారు. కొన్ని ఆటల ప్రభావానికి గురై ప్రాణాలు పోగొట్టుకున్నవారు ఉన్నారు. కొందరి విషయంలో సెల్‌ఫోన్ వ్యసనం మాదకద్రవ్యాలు, గంజాయి సేవనం కంటే ఎక్కువ నష్టం కలిగిస్తున్నదని సామాజికవేత్తలు



అంటున్నారు. సోషియల్ మీడియా, సెల్‌ఫోన్‌ల దుర్వినియోగం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయి. శారీరక వ్యాయామాలు లేకపోవడం వల్ల స్థూలకాయం ఒత్తిడి, డిప్రెషన్ తలెత్తుతున్నది. కొందరు యువకులలో సామర్థ్య లోపం, స్పెర్మ్ కౌంట్ తగ్గిపోవడం జరుగుతున్నదని డాక్టర్లు చెపుతున్నారు. అలాగే కంటిచూపు దెబ్బతినడం, వినికిడి సమస్యలు, టినిటస్ (చెవిలో హోరు, శబ్దాలు వినిపించడం) లాంటి సమస్యలు తలెత్తుతున్నాయంటారు. అపరిపక్వ ప్రేమలు, వివాహేతర సంబంధాలు, పలు నేరాలలో కూడా సెల్‌ఫోన్లు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని పలు సంఘటనల ద్వారా వెల్లడయింది. ఈ నేపథ్యంలో సమాజంలోని ప్రతిఒక్కరు జాగ్రత్తలు, నియంత్రణలు పాటించవలసిన అవసరం ఉంది.

### వికాసమే విరుగుడు

సమాజంలో తలెత్తే వికృత పోకడలకు వికాసమే సరైన విరుగుడని సైకాలజిస్టులు చెపుతున్నారు. దీనిని మరొక విధంగా చెప్పాలంటే పరివర్తనే పరిష్కారం అనవచ్చు. అంటే ప్రజలు, ముఖ్యంగా యువత సమాజానికి తమకు హాని కలిగించే అంశాలను గుర్తించి జాగ్రత్త పడాలి. ఏది ఎంత వరకు సమంజసమో గుర్తించాలి.

తాము చేస్తున్న పనులను స్వయంగా విశ్లేషించుకోవాలి. ఎవరికి వారు శాస్త్రీయ సామాజిక ప్రమాణాలను అర్థం చేసుకుని స్వీయ విశ్లేషణ చేసుకోవాలి. తమలో ప్రవర్తనా లోపాలు, వ్యసనాలు తలెత్తాయని తెలిసిన వెంటనే సరిదిద్దుకోవాలి.

అవసరం అనిపిస్తే నిపుణుల సలహాలు తీసుకోవాలి. తల్లిదండ్రులు తమ పిల్లల తీరును గమనిస్తుండాలి. దారి తప్పుతున్నారని తెలియగానే సరిదిద్దడానికి ప్రయత్నించాలి. అవసరమైతే నియంత్రణ చర్యలు చేపట్టాలి. సామాజిక వ్యవస్థలు అయిన విద్యా సంస్థలు, పోలీసు లు, ప్రభుత్వ శాఖలు, ఇతర సంస్థలు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. సమాజానికి మార్గదర్శనం చేయడంలో ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలి. దేశ ప్రగతికోసం యువతను నడిపించాలి. ❑

**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458




# శుభ కార్యాలు వాయిదా పడుతున్నాయా?

**ఇంట్లో జరగాల్సిన పెళ్లిళ్లు, సత్యనారాయణ వ్రతం, కేదారీశ్వర వ్రతం లాంటివి వాయిదా వేయవలసి రావటం; సీమంతాలు, నామకరణం.. అనుకున్న సమయంలో జరిపించకపోవటం, తీర్థయాత్రలకు వెళ్లటానికి నిశ్చయించుకున్నట్లు వెళ్లలేకపోవటం.. వీటిన్నిటికీ కారణాలేమయినా వుండవచ్చు.**

ఆర్థిక పరమైన ఇబ్బందులు, ఇంట్లో ఎవరికైనా ఆరోగ్యం చెడిపోవటం, దగ్గరి బంధువుల్లో ఎవరికైనా సీరియస్ అయి హాస్పిటల్లో జాయినవ్వటం లేదా కాలం చేయటం, అనుకోని విధంగా ఖర్చు పెరిగిపోయి శుభకార్యానికి దాచుకున్న డబ్బు వేరే పనికి వినియోగించటం... ఇలాంటి అనేక కారణాల వల్ల శుభకార్యాలు ఆగిపోవటం, వాయిదా పడుతూ వుంటాయి.

ఇది సర్వసాధారణంగా అందరికీ అనుభవంలోకి వచ్చే విషయమే. అయితే ఒకటి రెండుసార్లు వాయిదా పడటంలో వింతేమీ లేదు. కానీ అదేపనిగా వాయిదా వేయాల్సి వస్తే ఆలోచించాల్సిన విషయమే.

కొంతమంది విషయంలో అసలు శుభకార్యాల ప్రస్తావనే రాదు. ఎందుకంటే పరిస్థితుల ప్రభావం వాటి గురించి ఆలోచించటానికే భయం కలిగేదిగా వుంటుంది. ఆడపిల్లల పెళ్లి ఆలోచనే భయపెడుతుంది.



శుభకార్యాలు అదేపనిగా వాయిదా పడుతున్నప్పుడు లేదా 'శుభకార్యాలు జరిపించే స్థోమత తమకు ఇక లేదు' అని ఇంటి యజమాని నిరాశా నిస్పృహలకు లోనవుతున్నప్పుడు వాస్తు ప్రకారం ఒక్క విషయం గమనించాలి. ఆ యజమాని ఇంటికి దక్షిణ ఆగ్నేయంలో తలుపు వుందా? లేదా? అని.

ఇంటికి కాంపౌండ్ గోడలు వుండి, ఆ ఇంటికీ, కాంపౌండు గోడలకూ మధ్య దక్షిణం వైపు ఉన్న స్థలం కంటే ఉత్తరం వైపున స్థలం ఎక్కువగా వుండాలి. తూర్పు వైపున వున్న స్థలం పశ్చిమ వైపున వున్న స్థలం కంటే ఎక్కువగా వుండాలి.. అన్నది వాస్తు నియమం.

ఒక స్థలం దిక్కులు, మూలలు ఆ ఇంటిని కట్టిన దిక్కులు, మూలలూ ఒకే వైపుకు కనిపిస్తాయి. కానీ మూలలను నిర్ధారణ చేయటంలో కాస్త లోతుగా ఆలోచించి నిర్ణయించుకుంటే తప్ప ఈ దక్షిణ ఆగ్నేయ తలుపు గురించి కానీ, మరే మూలలో వున్న తలుపు గురించి కానీ ఓ కచ్చితమైన అవగాహన కలుగదు.

శుభకార్యాలు వాయిదా పడుతూ వుంటే దక్షిణ ఆగ్నేయంలో తలుపు తెరవండి అని చెప్తే/రాస్తే సరిపోదు. దాని గురించి వివరంగా తెలియజేయాలి. దక్షిణ ఆగ్నేయం అంటే ఏమిటో పూర్తిగా వివరించాలి. అలాగే మిగతా మూలల నిర్ధారణ చేయటం/తెలుసుకోవటం అవసరం.

## నైరుతి స్థలాలు

దక్షిణ, పశ్చిమాల్లో వీధులున్న స్థలాలను 'నైరుతి స్థలాలు' అంటారు.

స్థలానికి పశ్చిమంలో వున్న రోడ్డు దక్షిణం నుండి ఉత్తరానికి పల్లంగా, దక్షిణంలో వున్న రోడ్డు పశ్చిమం నుండి తూర్పుకు పల్లంగా వుండే విధంగా స్థలం నిర్ణయం చేసుకోవటం ఉత్తమం. స్థలంలో వాస్తు ప్రకారం అవసరమయిన మార్పులు చేసుకోవచ్చు కానీ రోడ్లను మార్చడం సాధ్యంకాదు కనుక ముందే ఈ విషయంలో జాగ్రత్త పడడం మంచిది. స్థలంలో నేలను కూడా దక్షిణం నుండి ఉత్తరానికి, పశ్చిమం నుండి తూర్పుకు పల్లం చేసుకోవటం ఏ స్థలానికయినా తప్పదు.

నైరుతి మూలకన్నా ఆగ్నేయమూల పల్లంగా, ఆగ్నేయ మూలకన్నా వాయువ్య మూల పల్లంగా, వాయువ్య మూలకన్నా ఈశాన్యమూల పల్లంగా సరిచేయటం వల్ల ఈశాన్యం మిగతా దిక్కులన్నిటికంటే పల్లమవుతుంది. వర్షపునీరు ఈశాన్యమూల నుండి బయటకు వెళ్లేలా ఈశాన్యంలో తూర్పునగానీ, ఉత్తరానగానీ వీలునను సరించి ప్రహరీగోడకు చిన్న తూమును ఏర్పాటు చేస్తే దాదాపు సగం వాస్తుమన్నిక ఆ స్థలానికి వచ్చేసినట్లే. నైరుతి స్థలానికి నైరుతి పల్లమై అటుగా నీళ్లు బయటకు ప్రవహించటం మంచిది కాదు. ఏ స్థలానికయినా నైరుతి పెరగకూడదు. ప్రత్యేకించి నైరుతి స్థలాలకు నైరుతి పెరగటం కానీ, నైరుతి భాగంలో ఇంట్లోగానీ, ఆవరణలోగానీ, ఆవరణ బయటగానీ బావులు, గొయ్యిలు వుండటం శ్రేయస్కరం కాదు. అటువంటి వాటిని నిర్లక్ష్యం చేయడం ప్రాణాలతో చెలగాటమే అవుతుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకోవటం వల్ల ప్రయోజనం శూన్యం. వాస్తు మీద నమ్మకం వున్నా లేకపోయినా ఇలాంటి విషయాల్లో జాగ్రత్త పడటం వల్ల వచ్చే నష్టం ఏమీ లేదు. నైరుతి భాగం ఇంటి 'ఫ్లోరు' కంటే ఎత్తులో వుండాలి.

**(మిగతాది వచ్చే ఆదివారం..)**

# జీవితమే ఒక ఆట

**ఆయన ఓ జెన్ సాధువు. ఆయన వయో వృద్ధుడు. అంత్య దశలో ఉన్నాడు. సన్నిహితులను కున్నవారిని పిలిపించుకున్నారు.**

"మిత్రులారా, నేను భిన్న రీతిలో తనువు చాలించాలనుకుంటున్నాను. అది నా ఆశ అనుకోండి. అందుకు మీరు ఓ ఆలోచన చెప్పండి" అడిగారు జెన్ సాధువు.

ఆ మాటకు మిత్రులందరూ పగలబడి నవ్వారు.

"ఏం మాట్లాడుతున్నారు మీరు? మరణం అనేది ఓ ఆటా?" అని అడిగారు వారు.

అప్పుడా జ్ఞాని ఆలోచనలో పడ్డారు. అనంతరం అడిగారు.

"ఇప్పటివరకూ ఎవరైనా నడుస్తూ నడుస్తూ మరణించేరా? మీరెప్పుడైనా అటువంటి విషయం కన్నారా?" అని.

అందరూ "లేదు.. లేదూ.. " అన్నారు.

అయితే ఒక్కరు మాత్రం ఇలా చెప్పారు.

"అలా ఓ మనిషి నడుస్తూ నడుస్తూ చనిపోయినట్టు ఓ కథలో చదివానండి.. ఓ జ్ఞాని మాత్రమే అలా చెయ్యగలరు" అని ఆ వ్యక్తి చెప్పారట అన్నారు.

"సరే.. అలాగైతే అటువంటి మరణం నాకు వద్దు. అయితే నిలబడి ఎవరైనా ప్రాణం విడిచేరా?" అని అడిగారు ఆ సాధువు.

"ఒకరున్నాండీ" అని ఇంకొకడు చెప్పాడు.

"మనిషి ఎలా బతుకుతాడో అలా మరణించడమే మంచిది.. సరే.. ఎవరైనా తలకిందులుగా, యోగా చేస్తూ ప్రాణం విడిచేరా?" అని అడిగారు.

మిత్రులు ఓ నవ్వు నవ్వారు.

"తలకిందులుగా నిలబడి మరణించినట్టు మేం ఎక్కడా వినలేదు.. కనలేదు, అయినా అది అసాధ్యం" అన్నారు.

అప్పుడా సాధువులో కొత్త ఉత్సాహం పుట్టుకొచ్చింది. వెంటనే లేచారు తలకిందులుగా నిల్చున్నారు.. ప్రాణం విడిచారు.

అంతే... ఆ ఆశ్రమంలో ఒకటే గందరగోళం. ఆయనను నేల మీద ఎలా పడుకోపెట్టాలో అర్థం కాలేదు. ఇలా ప్రాణం విడిచినవారి గురించి ఎక్కడా వినలేదు.

నిజంగానే ఆయన చనిపోయేరా? అనేది కూడా వారికి ప్రశ్నగానే ఉంది.

పరీక్షించాలనుకున్నారు. గుండెచప్పుడు, నాడి కొట్టుకోవడం వంటివేవీ లేదు. అన్నీ ఆగిపోయాయి.



ఆయన ఎప్పుడూ అంతే. ఇప్పుడేం చేయాలి? అని అందరూ ఆలోచించారు.

అప్పుడు ఓ పెద్దాయన ఇలా చెప్పారు..

"ఈ సాధువుసోదరి ఇక్కడికి సమీపంలో ఉన్న మరొక ఆశ్రమంలో ఉన్నారు. వారిని ఇక్కడకు పిలుచుకువస్తే ఆమె ఏదన్నా మార్గం చెప్పవచ్చు" అన్నారు.

ఆవిడకు 90 ఏళ్లు. ఆవిడను పిలుచుకువచ్చారు. ఆవిడ ఓ చేతికర్ర పట్టుకుని నడుచుకుంటూ వచ్చారు. తమ్ముడు తలకిందులుగా నిలబడి ప్రాణం విడవడాన్ని చూసారు. తన చేతికర్రతో ఆ శరీరాన్ని కొడుతూ, చనిపోయేటప్పుడు కూడా నీ అల్లరిచేష్టలు మానలేదు కదా.. మామూలుగా చనిపోయి ఉండొచ్చుగా" అన్నారావిడ.

అంతే.. వెంటనే ఆ సాధువు మళ్లీ నిటారుగా నవ్వంగా నిల్చున్నారు. "అక్కయ్యా, కోప్పడకు. నేను సవ్యంగానే చస్తాను. ఎలా చనిపోతేనేం.. అన్నీ నాకు ఒక్కటే అని, నేల మీద పడుకుని ప్రాణం విడిచారు సాధువు.

ఆ తర్వాత ఆవిడ అక్కడి నుంచి వెనుతిరిగి చూడకుండా వెళ్లిపోయారు.

మరణాన్ని కూడా ఓ ఆటగా చేసుకున్న ఆ సాధువుకి జీవితమూ ఓ ఆటగానే సాగింది.

ఏ ఉద్దేశమూ లేకుండా పని చేసుకుంటూ పోవడమంటే ఏమిటి? అనేది కూడా ఆయనకు తెలుసు. ఫలితాన్ని ఆశించకుండా పని చేసుకుంటూ జీవించి తనువు చాలించిన మహాత్ముడు ఆయన.

"తన శ్రమనుగానీ, పనినిగానీ ఓ ఆటలా చేసుకుంటూ పోవడం తెలిసిన వారికి జీవితమే ఓ ఆటగా మారిపోతుంది. అన్నీ ఓ ఆటగా అనిపిస్తుంది. మరణమూ అంతే.

కానీ అంతకన్నా ముందు మీలోని నిజమైన నటుడిని మీరు గుర్తించాలి. మీరు నటించాల్సిన అవసరమే లేదు. మీరు ఇప్పటికే నటిస్తూనే ఉన్నారు. మీరు ఈ నిజాన్ని తెలుసుకోవాలంతే" అంటారు ఓషో.

మీరు వీధిలో నడుచుకుంటూ పోతున్నారు. ఎదురుగా వస్తున్న ఒకతను మిమ్మల్ని చూసి "ఎలా ఉన్నారు?" అని అడిగారు.

"బాగున్నాను" అంటారు. నిజానికి మనం బాగుండం. అయినా బాగున్నామని చెప్తాం. అది నటనేగా.

మిమ్మల్ని కలుసుకోవడం చాలా సంతోషం అంటాం. వెంటనే మీలో మీరు ఆలోచించండి. నిజానికి మీ మనస్సు ఆయనను కలవడం వల్ల సంతోషంగా ఉందా? అదీ ఓ నటనేగా.

జీవితాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే అన్నీ నటనే అని అర్థమవుతుంది.

పెళ్లిపత్రిక పంపాను.. రాలేదేమిటి? అని ఒకడు అడిగినప్పుడు "వచ్చానే" అంటాం.

"ఒరేయ్! ఎందుకురా అబద్ధం చెప్తావు? నేను నీకు పెళ్లిపత్రికే పంపలేదుగా" అంటాడతను.

అప్పుడు.. మనం "పత్రిక పంపానని నువ్వు అబద్ధం చెప్పినప్పుడు నేను పెళ్లికి వచ్చానని అబద్ధం చెప్పకూడదా?" అంటాం.

**- యామిజాల జగదీశ్**



# పల్లెకి పోదాం..

పల్లె పొలిమేరలో అడుగు పెట్టగానే
డప్పుల మోత చప్పుళ్లకు
దరువేస్తూ
పూనకం వచ్చినట్టు ఊగుతోంది..
పురాతన జ్ఞాపకమేదో లోలోపల
పోగొట్టుకున్నదేదో తిరిగి దొరికినట్టు
పైరగాలికి ఊగే పంటచేనులా
ఎదనిండా ఎంత ఆహ్లాదం.
నాలోంచి పసివాడొక్కడు నిద్రలేచి
సైకిల్ టైరు దొర్లిస్తూ
మట్టిదారిలో మరోసారి
పరుగెత్తినట్టున్నాడు
ఊరి సెలయేరు గబుక్కున
గుండెల్లోకి దూకి
ఈదుతూ కేరింతలు కొడుతోంది
మహనీయులు ఎందరినో అందించిన వీధిబడి
వినయంగా పాఠాలను వల్లె వేసుకుంటుంది
జ్ఞాన యోగిలా రావిచెట్టు రచ్చబండ మీద
తాత జ్ఞాపకాల ఆకులు రాల్చుతోంది
గుట్టని దాటి చెట్ల మీదుగా వినబడే పిట్టలపాట
డోల్బి స్టీరియోలను మరిపిస్తుంది
గ్రీష్మం తాపాన్ని తగ్గించుకునేందుకు
చెట్లనీడల్లో తపస్సు చేసుకుంటోంది
వచ్చే వానకోసం వంకర్లు తిరుగుతూ వాగు ఊరంతా
పారుతోంది
ఎన్ని ఏ.సీలు పెడితే ఏటి ఒడ్డున వీచే
ఈ ప్రాణవాయువు దొరుకుతుంది
ఈ గాలిలో అన్నమయ్య రాగం లాంటి అనురాగమేదో ఉంది
ఆవుపాల నురుగులా.. అమాయక పలకరింపుల్లో
ఆత్మీయత పొంగుతుంది ఊరించే ఉడుకు బెల్లంలా
కాల్చిన వేరుసెనగ గుళ్లలా.. లేలేత తాటిముంజెలా
ఘుమఘుమలాడుతోంది పల్లె/ నాగరికత ఎంత ఎదిగినా
తల్లివేరు ఎప్పుడూ పల్లెటూరే/ కాస్సేపు మాయాతెరల పొరల
అంతర్జాల జాలాల నొదిలేసి/ తాడు లాగిన బొంగరంలా పల్లె
చుట్టూ గిరగిరా తిరుగుదాం/ కాలుష్యం నకిలీతనం సోకని
పల్లెనొకదాన్ని పక్కనెక్కడైనా/ పదిలంగా దాచుకుందాం
పది మంది మంచి మనుష్యులు కలిసినప్పుడల్లా పండగ
చేసుకుంటూ/ రంగుల పతంగులై పైకెగురుదాం.

**- గరిమెళ్ళ నాగేశ్వరరావు**

---

# అంతిమ విజయం

సందర్భమేదైనా
సాధించేందుకే సాగాలి
ఒడిదుడుకులు
ఓడించేందుకు రావు
నిన్ను రాటుదేల్చేందుకే
ప్రతీదొక అనుభవమై
ఎక్కే శిఖరాలకు చేర్చే
సోపానాలవ్వాలి
చుట్టూ చూడు.. కానీ!
నీలోని నిన్ను చూడకుండా ఉండకు
నీతో నీకు స్నేహం శాశ్వతం
నిన్ను నిన్నులా చూపించి
నీతో నడిచే నీలోని నువ్వే
జడియకుండ అడుగేయ్
స్వప్నం సాకారమవుతున్నపుడు
సంయమనం అవసరం
ఎందుకంటే?
ఎంతో శ్రమించి, ఎన్నో త్యజించి
కట్టుకున్న సౌధమది
కాస్త నిదానించు
నీ చెంత చేరేదాక
ఒక్క తప్పటడుగు చాలు
అది
అధఃపాతాళానికి
చేరడానికి
సంయమనమే మన ఆయుధం
సాధనే మన విజయం

**– సి.శేఖర్(సియస్సార్)**

## ఈ వారం కవిత్వం





# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. వ్యాపారులకు అనుకోని చోట స్వల్ప నష్టసూచనలున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలకు అవకాశం. ఉద్యోగులకు పనివత్తిడి అధికం. ప్రముఖులతో పరిచయం ఏర్పడుతుంది.

## వృషభం



వృత్తి వ్యాపారస్తులకు బాగుంటుంది. శత్రువులు మిత్రులవుతారు. విద్యార్థులకు శుభ యోగం. ఎన్ని వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. శుభ కార్యాలకు హాజరవుతారు. కాలానుగుణంగా వ్యాపారాలు చేసేవారికి ఆర్థికంగా బాగుంటుంది. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. వాహన యోగం.

## మిథునం



అన్ని వ్యవహారాల్లో మీదే విజయం. ఎదురు చూస్తున్న శుభ సమాచారం వారాంతంలో తెలుసుకుంటారు. ఆధ్యాత్మిక చింతన అలవడుతుంది. వ్యవసాయదారులకు ప్రోత్సాహకాలు లభిస్తాయి. కళాకారులకు సన్మాన యోగం. హోల్ సేల్ వ్యాపారులకు సామాన్యంగా ఉంటుంది. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. దేవాలయాలు సందర్శిస్తారు.

## కర్కాటం



వృథా ఖర్చులను నియంత్రిస్తారు. ధర్మ రక్షణకై పాటు పడతారు. ఆరోగ్య సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించండి. నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. విదేశీ వస్తువులపై మక్కువ ఏర్పడుతుంది. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. ప్రయాణం లాభిస్తుంది.

## సింహం



చిరు వ్యాపారులకు బ్యాంకు రుణాలు మంజూరు. వృద్ధుల ఆరోగ్యం మెరుగవుతుంది. శ్రమకు తగిన ప్రతిఫలం లభించకపోవచ్చు. మీ శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. వృథా ఖర్చులను నియంత్రించడంలో విఫలమవుతారు.

## కన్య



నూతన వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. సామాన్య ధన లాభ సూచనలున్నాయి. స్త్రీలకు స్థిరాస్తి లభిస్తుంది. సాహస యాత్రలు చేయాలన్న కోరిక తీరే సూచనలు న్నాయి. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి, సహనంతో వ్యవహరించడం మంచిది. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఒక కొలిక్కి వస్తాయి. కోర్టు వ్యవహారాలు సానుకూలంగా వుంటాయి.

## తుల



విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. దంపతుల మధ్య స్వల్ప తగాదాలకు ఆస్కారం. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించడం మంచిది. శత్రువులు మిత్రులుగా మారతారు. ఏది జరిగినా మన మంచికే అన్న ధోరణి అలవడుతుంది. కింది స్థాయి ఉద్యోగులతో మాట్లాడేటప్పుడు సంయమనంతో వ్యవహరించండి. పెట్టుబడులు లాభిస్తాయి. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి సామాన్యం.

## వృశ్చికం



చిరు వ్యాపారులకు పోటీ ఏర్పడినా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. ధార్మిక చింతన అలవడుతుంది. కుటుంబంలో వివాదాలు తీవ్రమవుతాయి. చిన్నా-పెద్దా అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. చోర భయం పొంచి వుంది కనుక విలువైన వస్తువులు, పత్రాల పట్ల జాగ్రత్తలు పాటించండి.

## ధనుస్సు



దీర్ఘకాలిక సమస్యలు వారాంతంలో పరిష్కారమవుతాయి. స్త్రీలకు స్థిరాస్తులు లభిస్తాయి. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. ఉద్యోగ ప్రయత్నం ఫలించే సూచనలు న్నాయి. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ వార్తలు వింటారు. పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. తీర్థ యాత్రలు చేయాలన్న కోరిక తీరుతుంది. గృహ యోగం.

## మకరం



శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. దేశాంతర ప్రయాణం చేస్తారు. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. ఎన్ని వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి రంగాల్లో వున్నవారికి పోటీ ఏర్పడినా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. కోర్టు వ్యవహారాలు వాయిదా పడుతుంది.

## కుంభం



శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారమంతా ఉత్సాహంగా గడుస్తుంది. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. ఉద్యోగ ప్రయత్నం ఫలిస్తుంది. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. కోర్టు తీర్పు అనుకూలంగా ఉంటుంది. అన్ని రంగాల్లోనివారు ఎంతో కొంత లాభపడతారు.

## మీనం



శుభ కార్యాలకు హాజరవుతారు. భాగస్వామ్య వ్యాపారులకు ఆశించిన ఫలితాలు ఉంటాయి. కుటుంబ పెద్దల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. వృథా కాల క్షేపం మంచిది కాదు. దంపతుల మధ్య అన్యోన్యత ఏర్పడుతుంది. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. కుటుంబ సమేతంగా విందు- వినోదాల్లో పాల్గొంటారు. నూతన వ్యక్తులతో పరిచయం. క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది.

# సరదాగా కాసేపు నవ్వుకోండి

### తక్కువ సమయం..

ఇంటర్వ్యూ అధికారి: "మన కంపెనీ అగరుబత్తుల అమ్మకం ఎక్కువ కావాలంటే ఏం చెయ్యాలి?"
నిరుద్యోగి: కట్టలో అగరుబత్తులు ఎక్కువగా ఉండాలి, అవి తక్కువ సమయం మాత్రమే వెలగాలి" అన్నాడు.

### భూమి ఉన్నందువల్ల..

టీచర్: భూకంపాలు ఎందుకు వస్తాయి?
విద్యార్థి: భూమి వుండడం వల్ల భూకంపాలు వస్తాయి.

**- కె.లహరి,** కరీంనగర్

### పరుగెత్తిస్తోంది..

సుబ్బారావు: రోజూ వాకింగ్‌కి వెళ్లేటప్పుడు మీ టామీని తీసుకెళ్తావు కదా.. ఈ రోజు ఒక్కడివే వెళ్తున్నావేంటి?
అప్పారావు: వాకింగ్‌లో టామీ వేరే వాకర్స్ కుక్క దగ్గరికి వెళ్లి నన్ను బాగా పరిగెత్తిస్తోంది. వాకింగ్‌కి బదులు నాకు రన్నింగ్ అవుతోంది.

**- ఎస్.కె.యాకుబ్‌పాషా,** ఖమ్మం

### ఆయనే వంట చేస్తారు


"నేను మా ఆయన ఆఫీసు నుండి వచ్చేంతవరకు ఏమీ తినను" అంది పింకీ, విజ్జుతో.
"మీ ఆయన అంటే అంత ఇష్టమా నీకు"
"అదేంకాదు.. ఆయన వచ్చాక వంట చేస్తాడు.. అందుకని".

### నాన్నకు కాలు విరిగింది

టింకు: అంబులెన్స్‌కి ఫోన్ చేసి త్వరగా రావాలి. నాన్న మా అమ్మని కొట్టాడు.
నర్సు: మీ అమ్మకు ఏమైంది?
టింకు: అమ్మకు ఏమీ కాలేదు కానీ నాన్నకు కాలు విరిగింది.

### అందుకే వాపస్..

మనీ ఆర్డర్ చేయడానికి పరమేశం పోస్టాఫీసుకు వెళ్లాడు.
క్లర్క్: సార్! ఈ నోటు చిరిగిపోయింది.
పరమేశం: అవునయ్యా నాకు తెలుసు. అందుకేగదా ఆ నోటు ఇచ్చినవారికే తిరిగి పంపిస్తున్నాను.



### వందవరకే వచ్చు

కామేశం: కొబ్బరికాయలు లెక్కపెట్టి చెప్పు ఎన్నున్నాయో?"
చలమయ్య: అయ్యా! లెక్కపెట్టాను, వంద ఉన్నాయి.
కామేశం: ఏరా! ఇంకా చాలా మిగిలివున్నాయిగా!
చలమయ్య: వంద తరువాత ఇక లెక్కబెట్టడం రాదు నాకు.

### మీరు తలచుకుంటే..

డైరెక్టర్: మాకు కావలసిన నటి వివాహం అయి వుండాలి, ఇల్లాలిగా కనిపించాలి.
రోజీ: మీరు తలచుకుంటే అవుతుంది సార్.

**- ఈ.ఎస్.మాధవన్**

### గ్లాసు మారిపోయినట్టుంది..

భర్త: ఈరోజు కాఫీ చాలా బాగుంది డియర్.
భార్య: అయ్యో, మా అమ్మ కాఫీ గ్లాస్ మీకిచ్చినట్టున్నానండీ!
భర్త: ఆ....

### అప్పులున్నాయి..

భర్త: ఎవరైనా వచ్చి నా గురించి అడిగితే నేను ఇంట్లో లేనని చెప్పు.
భార్య: మనకెందుకండీ భయం! మన దగ్గర డబ్బు, బంగారం లాంటివి ఏమీ లేవుగా!
భర్త: అవన్నీ లేకపోతేనేం..! అప్పులున్నాయిగా.

### ఇదేం బాగాలేదు

కూతురు: నాన్నా! ఇదేం బాగాలేదు?
తండ్రి: ఏమైంది?
కూతురు: పాకెట్‌మనీ వెయ్యి రూపాయలు ఇమ్మంటే వంద రూపాయలు ఇచ్చారు.
నాకు పెళ్లి చేస్తే ఆ తిప్పలేవో ఆయనే పడతాడు కదా!

### ముగ్గు

సెలెక్టర్: జానకిగారూ! మీరేసిన ముగ్గుకి మొదటి బహుమతి వచ్చింది కదా! ముగ్గుల మీద మీ అనుభవాలు చెప్పగలరా?
జానకి: అనుభవమా? ఏమన్నానా? ముగ్గుగిన్నె జారి కింద పడింది. దానికే మొదటి బహుమతి వచ్చింది.

### కఠినంగా

పార్వతీదేవి: స్వామీ! ఈ మానవుడు భూలోకంలో చిట్స్ అండ్ ఫైనాన్స్ కంపెనీ నడిపి మధ్యలో పరారైపోయాడు. ఇటువంటి దుష్టుడుని కఠినంగా శిక్షించండి.
శివుడు: వద్దు దేవీ, ఇలాంటివాళ్లని శిక్షించడం మొదలుపెడితే భూలోకంలో సగం మంది మానవులు మిగలరు.

### లొట్టలేసుకుని తింటారు

కూతురుపంది: మమ్మీ, మనం బురదలో తిరుగుతామని విమర్శిస్తున్నారు.
తల్లిపంది: ఇప్పుడు అలాగే అంటారు. తరువాత మన మాంసాన్ని లొట్టలేసుకుని తింటారు.

**- వైదా ఈశ్వరరావు,**
మింది, విశాఖపట్నం

## హాస్యరచనలకు ఆహ్వానం

ఈ శీర్షిక కోసం హాస్య(మినీ) కవితలు, పంచ్ డైలాగ్స్, జోక్స్ పంపించగలరు. కాపీ జోక్స్, రచనలను పంపకండి.

మా చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త,
నం.396, లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com

సింగిల్ పేజీ కథ

# ఆదాయం

మట్టి అంటుకున్న ముఖాన్ని చీరకొంగుతో తుడుచుకొంటూ తన దగ్గరికి వస్తున్న తల్లిని చూడగానే చంద్రలేఖ గుండె కలుక్కు మంది. "ఈ సమయంలో వస్తావని తెలుసు. పని చేస్తూనే వచ్చే ప్రతి బస్సు గమనించసాగాను. నాకు పని అయిపోయింది. కూలీ తీసుకోడానికి నిలబడిన సమయంలో నీవు బస్సు నుండి దిగడం చూడగానే నేను కూలీ తీసుకొని వేగంగా వచ్చాను" అంది.

"అమ్మా రోజంతా కష్టపడి పని చేసినందుకు ఎంత కూలీ ఇచ్చారు?

"మగవారితో పాటు సమానంగా పని చేసినా ఆడవారికి ఐదు వందల రూపా



యలు, మగవారికి ఆరు వందల యాభై రూపాయలు. నీ చదువు పూర్తయ్యాక ఏదో ఒక ఉద్యోగంలో చేరేంతవరకే ఈ పనికెళ్తాను".

"విడో పెన్షన్ చాలు కదమ్మా. అదీగాక మన వీధిలోవున్న పది ఇండ్లల్లో పేడనీళ్లు చల్లి ముగ్గులేస్తున్నందుకు మరో రెండు వేలు వస్తోంది. ఎందుకమ్మా కూలీకి వెళ్లావు?"

"పని చేస్తే వచ్చే ఆదాయంతో నీకు ఏదైనా ఖర్చులకు ఉపయోగపడుతుంది"

"నా చదువు ఖర్చులు అక్కయ్య భరిస్తోంది. వారిచ్చే ప్రతి పైసా లెక్క రాసుకొంటున్నాను. ఉద్యోగంలో చేరాక తప్పకుండా తిరిగిస్తాను. ఇప్పుడు అవసరం అంటూ ఏమీ లేకున్నా నీవిలా కష్టపడి పనికి వెళ్తే నేను చదువు మానేసి నీతో పాటు కూలీకి వస్తాను".

"నాలో శక్తి వున్నంతవరకు వెళ్తాను. ఆ తరువాత నువ్వెంత చెప్పినా వెళ్లను" అంది. తాముంటున్న గుడిసెకు వచ్చాక స్నానం చేసి దుస్తులు మార్చుకొని, పగలంతా కూలీపని చేసి వచ్చిన అలసట పైకి కనపడనీకుండా చిరునవ్వుతో వంటపనులు ప్రారంభిస్తున్న తల్లి వైపు చూస్తూ పక్కనే కూర్చొని మాట్లాడుతూ సాయం చేయసాగింది.

ఉదయాన్నే లేచి గుడిసెలో అమ్మ లేకపోవడం చూసి "ముగ్గు వేయడానికి వెళ్లి ఉంటుందని" ఊహించింది. వీధిలో రాజేంద్ర ఇంటిముందు ముగ్గు వేస్తున్న తల్లిని గమనించి వెళ్లింది.

"చంద్రమ్మా! ఆ ఎదురింట్లో ఏదో పూజ ఉందట, ఇంటిముందు పెద్ద ముగ్గు వెయ్యమని అడిగారు. నేను వేసిన ముగ్గును మెచ్చుకొని, నూరు రూపాయలు ఇచ్చింది" సంతోషంతో అంది.

అమ్మ చెప్పిన ఇంటి వైపు చూసి "పెద్ద ముత్యాల ముగ్గు" అంటూ వంద రూపాయలకే అంత సంతోషపడుతున్న తల్లి వైపు ఆశ్చర్యంగా చూసింది. ఆ ముగ్గును తన సెల్‌ఫోన్‌తో ఫొటో తీసింది. ఇద్దరూ నడుచుకొంటూ ఇంటివైపు వెళ్లసాగారు. అప్పుడే ఇంటిబయటకు వచ్చిన జమున "చంద్రలేఖా, ఎప్పుడు వచ్చావు?" అనడిగింది. "నిన్న సాయంత్రం వచ్చాను. ధనుషన్న ఇంకా నిదుర పోతున్నాడా పిన్నీ"

"ఇక్కడ జీతం తక్కువని ఫారిన్ వెళ్లే అవకాశం వస్తే వెళ్లాడు. అదేపని అక్కడ చేస్తున్నా మంచి జీతం వస్తోంది. ఈ పెంకుటిల్లు మిద్దె ఇల్లులాగా కట్టాలన్న ఆలోచనలో వున్నాను" అంది జమున.

ఉదయం టిఫిన్ తిన్న తరువాత "అమ్మా, అక్కడ హాస్టల్‌లో చదవడం కష్టంగా వుంది. హాస్టల్‌కు ఇచ్చే డబ్బుతో గది తీసుకొని మనమిద్దరం జీవించవచ్చు. బయట ఉంటే బాగా చదవవచ్చు" అంది.

"పెన్షన్ కాకుండా ముగ్గులు వేస్తూ నెలకు రెండు వేల రూపాయలు సంపాదిస్తున్నాను. ఇక అక్కడకు వస్తే నేను కూలీకి వెళ్లడానికి అంగీకరించవు. నేను రాను" అంది. "నీకు నా చదువు ముఖ్యమా? ఆ రెండు వేలు ముఖ్యమా?" అడిగింది. కొంత సమయం ఆలోచించి "ఇష్టం లేకున్నా నీ చదువు కోసం వస్తాను" అంది.

కాలేజీకి దగ్గరలో ఒక గది బాడుగకు తీసుకొని తల్లీ కూతుళ్లు చేరారు. వారం రోజుల తరువాత తన సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసిన ముగ్గులు చూపించింది.

"అమ్మా! ఈ ముగ్గులను వేయగలవా?" అడిగింది.

"ముందుగా పేపర్‌లో వేసి చూసుకొంటే సులభంగా వేయగలను"

చంద్రలేఖ తెచ్చిన పేపర్లలో ఆ ముగ్గులు వేయడం ప్రారంభించింది.

"అమ్మా! ఆ రోజు మన ఊళ్లో పెద్ద ముగ్గు వేసినప్పుడు వంద రూపాయలు ఇచ్చారే.. అలాంటి ముగ్గు రేపు వేయాలి" "ఐదు గంటలకు వెళ్తే చాలా?" వంద రూపాయల సంపాదన వస్తుందన్న సంతోషంతో చిరునవ్వుతో అడిగింది.

"ఇది పల్లెటూరు కాదు.. పట్నం. ఏడు గంటలకు మనం ఇక్కడి నుండి నడుస్తూ వెళ్తే చాలు. పది నిమిషాల్లో ఆ ఇంటికి చేరుకొంటాం" అంది. కూతురుతో పాటు కలిసి వెళ్లింది. ముగ్గు పూర్తయిన తరువాత ఆ ఇంటివిడ డబ్బు ఇస్తూ "ముగ్గు బాగుంది. మరలా ముగ్గు వేయవలసి వస్తే మెసేజ్ పెడతాం" అంది. చేతిలో ఉంచిన డబ్బు చూసి ఒక్కసారిగా కళ్లు తిరిగినట్లనిపించింది. కూతురుతో కొంత దూరం కలిసి నడిచాక "ఆ ఇంటి యజమాని ముగ్గుకు రెండు వేల రూపాయలు ఇచ్చింది?" అంది.


"అమ్మా, నీ శ్రమకు తగిన విలువలు పట్టణంలో ఎక్కువని గుర్తించాను. అందుకే నిన్ను ఇక్కడికి పిలిపించాను. హాస్టల్ చదువు నాకు ఇబ్బంది లేదు. కానీ గదికి వచ్చాక ఇంకా బాగా చదవడానికి అవకాశముంది. ఇక ముగ్గులు వేయడానికి ఇంటింటికి వెళ్లి అడగనవసరం లేదు. ఆన్‌లైన్‌లో వాళ్లే కాంటాక్ట్ చేసుకొంటారు. పట్టణాలలో కొంతమంది కొన్ని ముఖ్యమైన పండుగ రోజులలో, ధనుర్మాసంలో ముగ్గులు వేయించుకొనే అలవాటుంది.

ముగ్గును బట్టి ధరను ముందు ఆన్‌లైన్‌లో నిర్ణయిస్తాం. ఆ రోజు జమునా పిన్నీ తన కొడుకు దినేష్ ఫారిన్ వెళ్లిన సంగతి చెప్పినప్పుడు ఆ ఆలోచన కలిగింది. ఎక్కువ ఆదాయం ఇచ్చేచోట పని చేయడం మంచిదని నిన్ను ఇక్కడికి తీసుకొని వచ్చాను".

అతి తక్కువ కాలంలో ముత్యాలమ్మ వేసే ముగ్గులు ముత్యాల ముగ్గులు అను కోసాగారు. దినేష్ ఆదాయంలో పంపిన డబ్బుతో జమున పెంకుటిల్లు భవనం లాగా మారితే, ముత్యాలమ్మ ముగ్గుల ఆదాయంతో వారి గుడిసె పెంకుటిల్లుగా మారింది.

**- ఓట్ర ప్రకాశ్ రావు**

# ఈ వారం కా‘ర్టూన్స్’


..గొడవ పెట్టుకుని.. రెండు చేతులు ప్యాంటు జేబుల్లో పెట్టుకుని నడుస్తూ వెళ్లిపోయాడు.. ఎటు వెళ్లాడో తెలీదు.. తిరిగి రాలేదు..!!


ఇదయ్యా సమస్య..!!


నీకు కరోనా!
వచ్చింది.. భయపడకు!
RT PCR

## ఫోటో ఫీచర్







పదిహేడు అంతస్తుల ఈ ఆలయం థాయిలాండ్‌లో ఉంది. కింది నుంచి పై వరకు డ్రాగన్ చుట్టినట్లుగా ఉన్నందువల్ల దీనికి డ్రాగన్ టెంపుల్ అన్న పేరు వచ్చింది. మెట్ల ద్వారా పైకి వెళ్లవచ్చు. టూరిస్టులను ఎంతగానో ఆకర్షిస్తున్న ఈ ఆలయం ధ్యానానికి అనువైన ప్రాంతంగా పేరు గాంచింది.



